


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక




సంపుటి : 05 సంచిక : 140 పేజీలు : 8
బుధవారం 29-10-2025 వెల : 5/-
హైదరాబాద్ ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక HYDERABAD

## ఏపీ వ్యాప్తంగా మొంథా ప్రభావం



**-పవన్ కల్యాణ్ తో కలిసి సీఎం చంద్రబాబు సమీక్ష**

అమరావతి (ప్రశ్న న్యూస్) బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తీవ్ర తుపాను కోస్తాంధ్ర తీరంవైపు దూసుకొస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. తుపాను ప్రభావిత ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులను, అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా వాగులు ఆకస్మికంగా పొంగిపొర్లే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం అమరావతిలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో

మిగతా 2లో

## కబ్జా నుంచి 1.27 ఎకరాల స్థలాన్ని కాపాడిన హైడ్రా




**-ప్రజావాణిలో ఫిర్యాదుల ఆధారంగా ఆక్రమణల తొలగింపు**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)హైదరాబాద్ నగరంలో హైడ్రా పలు ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించింది. ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల మేరకు, సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలిన అనంతరం హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా, సరూర్ నగర్ మండలం, కర్మన్‌ఘాట్‌లోని హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో 1.27 ఎకరాల పార్కును కబ్జా చేశారంటూ స్థానిక అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. లే అవుట్‌లో పార్కు స్థలంగా చూపించి, ఆ

మిగతా 2లో

# నలువైపులా నాలుగు వివాదాలు

## -రచ్చకెక్కిన మంత్రుల తీరు, తలపట్టుకుంటున్న హైకమాండ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన కొద్ది నెలల్లోనే అంతర్గత కుమ్ములాటలు బయటపడుతున్నాయి. మంత్రులు, కీలక నేతలు బహిరంగంగా కామెంట్స్ చేసుకోవడం హైకమాండ్‌కు తలనొప్పిగా మారింది. తెలంగాణ కాంగ్రెస్‌లో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉందా? అన్న చర్చ ఇప్పుడు సాగుతోంది. ఇందుకు ఇటీవల జరిగిన వరుస సంఘటనలే కాంగ్రెస్ పార్టీ తీరును బయటపెడుతున్నాయి.

1. కొండా సురేఖ, పొంగులేటి వివాదం - బీసీ వర్సెస్ రెడ్డి వివాదంగా

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మధ్య వివాదం కాంగ్రెస్‌లో సంచలనంగా మారింది. బీసీ మంత్రిగా కొండా సురేఖ, రెడ్డి సామాజిక వర్గం మంత్రిగా పొంగులేటి మధ్య వివాదంగా ఇది రూపుదిద్దుకుంది. తన శాఖలోని పనులకు టెండర్లను తమ వారిని కాదని, మంత్రి పొంగులేటి తన మనుషులకు ఎలా ఇప్పించుకుంటారని, ఈ జోక్యం తగదన్నది కొండా సురేఖ వాదనగా ఉంది. ఈ విషయంలో ఇరు మంత్రుల మధ్య తలెత్తిన వివాదం రాజుకుని పార్టీలో బీసీ, రెడ్డి వర్గాల మధ్య సంఘర్షణగా మారింది. బీసీ మంత్రి అయిన తనను కొందరు రెడ్డి మంత్రులు పదవి నుంచి తొలగించడానికి కుట్రలు పన్నుతున్నారని మీడియా చిట్ చాట్‌లో కొండా సురేఖ చెప్పడం సంచలనం సృష్టించింది. దీంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో హైకమాండ్ తలపట్టుకుంటోంది. ఇలా క్యాబినెట్ మంత్రుల మధ్య పోరు ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్‌ను పలుచన చేసే పరిస్థితి ఏర్పడింది. అంతేకాదు, టెండర్లలో మంత్రుల జోక్యం ఈ వివాదం వల్ల బహిర్గతమైంది (లేదా బహిర్గతం అవుతోంది).

2. కొండా సురేఖ - సీఎం రేవంత్ రెడ్డి వివాదం - సీఎంకు అంటుకున్న ఆరోపణలు

కొండా సురేఖ మాజీ ఓఎస్‌డీ సుమంత్‌ను జూబ్లీహిల్స్‌లోని కొండా సురేఖ ఇంటి వద్ద అరెస్టుకు పోలీసులు ప్రయత్నించడం, ఈ అరెస్టును కొండా సురేఖ కుమార్తె సుష్మిత అడ్డుకోవడం పెద్ద వివాదానికి

మిగతా 2లో



## సాక్షులను బెదిరిస్తే ఇకపై నేరుగా ఎఫ్ఐఆర్

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కేసుల్లో సాక్షులను బెదిరించడంపై సుప్రీంకోర్టు మంగళవారం ఒక చారిత్రక తీర్పు వెలువరించింది. తప్పుడు సాక్ష్యం ఇవ్వాలంటూ సాక్షులను బెదిరించడం (ఐపీసీ సెక్షన్ 195ఏ) కాగ్నిజబుల్ నేరమని స్పష్టం చేసింది. ఇలాంటి ఘటనలపై పోలీసులు కోర్టు నుంచి ఎలాంటి రాతపూర్వక ఫిర్యాదు అవసరం లేకుండానే నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు చేపట్టవచ్చని తేల్చిచెప్పింది. జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. “ఐపీసీ సెక్షన్ 195ఏ కింద నమోదయ్యే నేరం కాగ్నిజబుల్ అయినప్పుడు, సీఆర్‌పీసీ సెక్షన్ 154, 156 కింద చర్యలు తీసుకునే పోలీసుల అధికారాన్ని శంకించలేం” అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. ఈ అంశంపై కేరళ ప్రభుత్వం, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్లను విచారించిన అనంతరం ఈ తీర్పు ఇచ్చింది. గతంలో ఇలాంటి కేసుల్లో కోర్టు నుంచి ఫిర్యాదు తప్పనిసరి అని పేర్కొంటూ కేరళ, కర్ణాటక హైకోర్టులు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు కొట్టివేసింది.ఐపీసీ సెక్షన్ 195ఏ (2006లో చేర్చారు) అనేది సెక్షన్ 193 నుంచి 196 వరకు ఉన్న ఇతర నేరాల కంటే భిన్నమైనదని, ప్రత్యేకమైనదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. “ఒక సాక్షి కోర్టుకు రాకముందే, చాలా కాలం ముందే బెదిరింపులు ఎదుర్కోవచ్చు. బాధితుడైన సాక్షి లేదా ఇతరులు వెంటనే పోలీసులను ఆశ్రయించడానికి వీలుగానే ఈ నేరాన్ని కాగ్నిజబుల్‌గా వర్గీకరించారు” అని ధర్మాసనం వివరించింది. అంతేకాకుండా, సీఆర్‌పీసీలోని సెక్షన్ 195ఏ (2009లో చేర్చారు) బాధితులకు మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు

మిగతా 2లో



## మరో ఇద్దరు నక్సల్ కీలక నేతల సరెండర్

**-ప్రజలతో కలిసి పని చేస్తామన్న చంద్రన్న, బండి ప్రకాష్**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ డీజీపీ ముందు మావోయిస్టు కీలక నేతలుప్రసాదరావు అలియాస్ చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాశ్ సరెండర్ అయ్యారు. మావోయిస్టు లొంగుబాటులో తెలంగాణ ఎస్ఐబీ కీలక ఆపరేషన్ నిర్వహిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు చంద్రన్న అజ్ఞాతం వీడారు. జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకున్నారు. చంద్రన్న కేంద్ర కమిటీలో కీలక సభ్యుడిగా పనిచేశారు.

**సీఎం రేవంత్ పిలుపు మేరకు లొంగిపోయాము**

అనారోగ్య పరిస్థితులు, ఆపరేషన్ కగార్ వల్ల తాము లొంగిపోయామని మావోయిస్టులు చెప్పారు. రేవంత్ సూచనాలతోనే జనజీవన

మిగతా 2లో

## హాలివుడ్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తా



**-సినిమా టిక్కెట్ రేట్ల పెంపుపై సీఎం సంచలన ప్రకటన**

**-కార్మికులకు వాటా ఇస్తేనే ఇక జీవో అన్న సీఎం రేవంత్**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)తెలుగు చిత్ర పరిశ్రమ భవిష్యత్తుపై, సినీ కార్మికుల సంక్షేమంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటనలు చేశారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో సినీ కార్మికులు

మిగతా 2లో




2

## మూసీ నది సుందరీకరణ ప్రాజెక్ట్ లో కీలక ముందడుగు

734.07 ఎకరాల భూమి బదలాయింపు

## జిల్లాల పునర్విభజనపై సీఎం చంద్రబాబు సమీక్ష

**-గత ప్రభుత్వ నిర్ణయాన్ని మార్చనున్న కూటమి సర్కారు**



2లో

## బ్యారేజీల మరమ్మత్తులకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయండి

**-అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు**



2లో

## ఎనిమిదో వేతన సంఘానికి కేంద్ర కేబినెట్ ఆమోదం

**-10 నెలల నిరీక్షణకు తెర**



2

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
బుధవారం 29 అక్టోబర్2025

# నలువైపులా నాలుగు వివాదాలు

దారి తీసింది. దక్కన్ సిమెంట్ కంపెనీ యాజమాన్యాన్ని గన్‌తో సుమంత్ బెదిరించారన్నది పోలీసుల ఆరోపణ. దీనిపై మరో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేశారని, సీఎం ఆదేశాల మేరకు అధికారులు సుమంత్‌ను ఓఎస్‌డీ పదవి నుంచి తొలగించడం జరిగింది. అంతే కాకుండా పోలీసులు కొండా సురేఖ ఓఎస్‌డీ సుమంత్‌ను మంత్రి ఇంటి వద్దే అరెస్టు చేసేందుకు వెళ్లడం వివాదానికి మరింత ఆజ్యం పోసినట్లయింది. ఈ సందర్భంగా కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత సీఎంపై చేసిన ఆరోపణలు సంచలనం సృష్టించాయి. గన్ బెదిరింపు విషయంలో సీఎం సన్నిహితుడు రోహిన్ రెడ్డి ఉన్నారని, ఆయనకు సీఎం గన్ ఇచ్చి పంపారని సుష్మిత ఆరోపణలు చేశారు. అంతే కాకుండా సీఎం సోదరులు భూదందాలు చేస్తున్నారని ఆరోపణలు చేశారు. దీంతో హైకమాండ్ రంగంలోకి దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏకంగా సీఎంపై క్యాబినెట్ మంత్రి కూతురు ఇలాంటి ఆరోపణలు చేయడం సంచలనంగా మారింది. ఈ వివాదం పరిష్కారం అయినప్పటికీ సుష్మిత చేసిన ఆరోపణలు ఇప్పుడు సీఎం రేవంత్‌కు ఓ మచ్చగా మారాయి. క్యాబినెట్ మంత్రిపై ఎలాంటి చర్యలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. తొలగిస్తే బీసీ మంత్రిని తొలగించారన్న అపవాదు కాంగ్రెస్ సర్కార్‌పై పడి ఉండేది. ఇక ఏం చేయలేని పరిస్థితుల్లో కొండా సురేఖ క్షమాపణలతో ఈ వివాదం ముగిసింది. అయినా గన్ పెట్టిన కేసు వివాదం తేలలేదు. సీఎంపై ఆరోపణల్లో వాస్తవాలు ఎంత అన్న దానిపై క్లారిటీ లేదు. ఇవన్నీ ఇప్పుడు ప్రజల్లో ప్రశ్నలుగా మిగిలిపోయాయి. ఇవి ఇప్పుడు ప్రతిపక్షాలకు అస్త్రాలుగా మారాయి.

3. పొన్నం – అడ్లూరి వివాదం – మాదిగ సామాజిక వర్గాన్ని కించపర్చారన్న ఆరోపణలు

కొండా వివాదం బీసీల రంగు పూసుకుంటే, ఇక మంత్రులు పొన్నం ప్రభాకర్ – అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ల మధ్య వాగ్వాదం మాదిగ సామాజిక వర్గం కినుక వహించేలా చేసింది. ఓ సమావేశంలో పొన్నం ప్రభాకర్ మంత్రి అడ్లూరిని అనుచితంగా సంబోధించారని ఆరోపణలు వచ్చాయి. దానికి సంబంధించిన వీడియో హల్ చల్ చేసింది. అయితే దీంతో పొన్నం బేషరతుగా క్షమాపణ చెప్పాలని, తను మాదిగ సామాజిక వర్గం నుంచి మంత్రి అయ్యాను కాబట్టే అలా విలువ లేకుండా మాట్లాడుతున్నారని అడ్లూరి డిమాండ్ చేయడం జరిగింది. అయితే తాను తన సిబ్బందిని సంబోధించానే తప్ప, మంత్రి అడ్లూరిని కాదని పొన్నం వివరణ ఇచ్చారు. అయినా దీనికి మంత్రి అడ్లూరి, ఆయన మద్దతుదారులు, మాదిగ సామాజిక వర్గ సంఘాలు మాత్రం సంతృప్తి చెందలేదు. ఈ పరిస్థితుల్లో హైకమాండ్ జోక్యం చేసుకుంది. సీఎం రేవంత్ సూచనల మేరకు దీనిపై మంత్రి పొన్నం విచారం వ్యక్తం చేస్తూ మీడియా ప్రకటన విడుదల చేయడం జరిగింది. అయినప్పటికీ మంత్రి అడ్లూరి మాత్రం తనకు క్షమాపణ చెప్పకుండా విచారం వ్యక్తం చేయడం ఏంటని బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే కాంగ్రెస్ పెద్దల సూచనల మేరకు ఇష్టం లేకున్నా అడ్లూరి ఈ వివాదాన్ని ముగించారు. అయితే ఈ ఉదంతం క్యాబినెట్‌లో మంత్రుల మధ్య సయోధ్య లేదన్న అంశాన్ని రూఢీపరుస్తోంది. సామాజిక వర్గాల వారీగా విడిపోయారా అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి వ్యాఖ్యలు పార్టీకి నష్టం చేస్తాయన్న ఆందోళనలో హైకమాండ్ ఉంది.

4. మంత్రి జూపల్లి – సీఎం రేవంత్ రెడ్డి వివాదం – ఇది ఓ నిశ్శబ్ద యుద్ధం

సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి మధ్య అంతర్గతంగా విభేదాలు ఉన్నాయన్న వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. మద్యం బాటిళ్లపై అంటించడానికి ఈ హోలోగ్రామ్ లేబుల్స్‌ను ఉపయోగిస్తారు. హై-సెక్యూరిటీ హోలోగ్రామ్ లేబుల్స్ వేయాల్సి ఉంటుంది. నకిలీ మద్యం, అక్రమ మద్యం రవాణా మరియు ఎక్సైజ్ పన్ను ఎగవేతలను అరికట్టడానికి ఈ లేబుల్స్‌లో బార్‌కోడ్, ఐటీ ట్రాకింగ్ సిస్టమ్ వంటి భద్రతా అంశాలు ఇందులో ఉంటాయి. దీనికి సంబంధించిన 500 కోట్ల విలువైన టెండర్ల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అల్లుడికి ఇప్పించాలని ప్రయత్నించారని, జూపల్లి తన కొడుకుకు ఆ టెండర్లు దక్కాలని ప్రయత్నించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు చేయడం గమనార్హం. ఈ విషయంలో ఆ శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వి నలిగిపోయారని ఈ క్రమంలోనే ఆయన వీఆర్ఎస్ తీసుకున్నారన్న వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే రిజ్వీ వీఆర్ఎస్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అయితే తన శాఖలో తన ఆదేశాలు పాటించకుండా ప్రభుత్వానికి నష్టం చేసిన రిజ్విపై చర్య తీసుకోమని ప్రభుత్వానికి సిఫారసు చేసినా పట్టించుకోకుండా ఎలా వీఆర్ఎస్ ఇస్తారని మంత్రి జూపల్లి ప్రభుత్వాన్నే ప్రశ్నించడం విశేషం. ఈ వివాదం వల్ల ప్రభుత్వ పనుల్లో సీఎం, మంత్రులు, వారి కుటుంబ సభ్యుల జోక్యం వల్ల అధికారులు ఇబ్బందులు పడుతున్నారన్న చర్చ సాగుతోంది. టెండర్లలో సీఎం- మంత్రుల జోక్యం అనే ఆరోపణలు ఇప్పుడు ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నాయి. ఇది ప్రతిపక్షాలకు కాంగ్రెస్ సర్కార్‌పై దాడి చేసేందుకు పదునైన అస్త్రంగా మారింది. మరో వైపు మంత్రి జూపల్లి సైతం ఆయా శాఖల్లో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు తెప్పించుకుంటున్నారని సచివాలయంలో చర్చ సాగుతోంది. ఈ పరిస్థితి కాంగ్రెస్ హైకమాండ్‌కు చిక్కులు తెచ్చిపెడుతోందని కాంగ్రెస్ వర్గాలే చెప్పుకుంటున్నాయి.

**ఇంటి పోరు నియంత్రణే హైకమాండ్ ఆలోచన**

గత ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచినంత మాత్రాన పార్టీలో నేతల మధ్య పూర్తి సమన్వయం లేదని, విభేదాలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయని పై ఉదంతాలు రుజువు చేస్తున్నాయి. మంత్రుల మధ్య ఈ అంతర్గత పోరు, విమర్శలు, ఆరోపణలు ప్రతిపక్షాలకు ప్రధానాస్త్రాలుగా మారుతున్నాయి. వీటిపై తక్షణం చర్యలు తీసుకోకపోతే ఇది పార్టీకి తీవ్ర నష్టం చేస్తుందన్న ఆలోచనలో కాంగ్రెస్ హైకమాండ్ ఉంది. తక్షణ నష్ట నివారణకు హైకమాండ్ ప్రయత్నిస్తోంది. గొడవలు సద్దుమణిగేలా చర్యలు తీసుకుంటోంది. అందులో భాగమే సీఎం రేవంత్‌కు కొండా సురేఖ బహిరంగ క్షమాపణ, అడ్లూరి వివాదం విషయంలో మంత్రి పొన్నం వివరణ-విచారం వ్యక్తం చేయడం వంటివి జరిగాయి. అయితే మంత్రుల మధ్య వ్యక్తిగత ఆధిపత్య విభేదాలు ముదిరితే రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఇబ్బందులు తప్పవని హైకమాండ్ గ్రహించిందని గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లోగా ఈ పరిస్థితిని తమ నియంత్రణలోకి తెచ్చుకునే ప్రయత్నాలు ప్రారంభించిందని, అందులో భాగంగానే సీఎం రేవంత్ రెడ్డి, ఇతర ముఖ్య నేతల ఢిల్లీ పర్యటన అని కాంగ్రెస్ సీనియర్లు చెబుతున్నారు. అయితే ఈ పరిస్థితిని అదుపు చేయడం మాత్రం హైకమాండ్‌కు కత్తిమీద సాములాంటిదేనని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

# ఏపీ వ్యాప్తంగా మొంథా ప్రభావం

కలిసి మొంథా తుపాను ప్రభావం, ప్రభుత్వ సన్నద్ధతపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

**తీరం దాటే ప్రాంతంపై ప్రత్యేక దృష్టి**

ప్రస్తుతం మొంథా తుపాను అత్యంత వేగంగా తీరానికి సమీపిస్తోందని, ఈ అర్ధరాత్రికి కాకినాడకు దక్షిణంగా తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇప్పటికే కాకినాడ, మచిలీపట్నం, విశాఖపట్నం సహా పలు తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, తుపాను తీరం దాటే అవకాశం ఉన్న కాకినాడ పరిసర ప్రాంతాలకు తక్షణమే మరిన్ని ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను తరలించాలని ఆదేశించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యంత్రసామాగ్రి, కమ్యూనికేషన్ పరికరాలు, అత్యవసర బృందాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గడచిన అనుభవాలను, ముఖ్యంగా హుద్‌హుద్ తుపాను సృష్టించిన విధ్వంసాన్ని గుర్తుచేసుకుంటూ, అప్పటి స్ఫూర్తితో కేవలం నాలుగు రోజుల్లోనే ప్రజలను గట్టెక్కించామని, అదే పట్టుదలతో ఇప్పుడు పనిచేయాలని పిలుపునిచ్చారు.

**క్షేత్రస్థాయిలో పక్కా సమాచారం ఉండాలి**

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎంత విస్తీర్ణంలో నీరు నిలిచింది, ఏయే వాగులు పొంగే ప్రమాదం ఉందో కచ్చితమైన అంచనాలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా క్షేత్రస్థాయి నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సోమవారం నుంచి భారీ వర్షాలు నమోదవుతున్నందున ఎర్రకాలువకు ఎగువ నుంచి ఆకస్మిక వరద ప్రవాహం వచ్చే ప్రమాదం ఉందని, ఆ ప్రాంతంలో అధికార యంత్రాంగం పూర్తి సన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.

**డ్రోన్లతో పర్యవేక్షణ, తక్షణ పునరుద్ధరణ**

తుపాను ప్రభావంతో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 43 వేల హెక్టార్లలో పంట నీట మునిగిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా కోనసీమ, ప్రకాశం, నంద్యాల, కడప, తూర్పుగోదావరి జిల్లాల్లో పంట నష్టం ఎక్కువగా ఉందని వివరించారు. ఈ సందర్భంగా పంట నష్టం వివరాలను రైతులు నేరుగా ప్రభుత్వానికి పంపేలా వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్‌లో మార్పులు చేయాలని సీఎం సూచించారు. డ్రోన్ల ద్వారా ముంపు ప్రాంతాలను, గాలుల కారణంగా కూలిపోయిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, టవర్లను గుర్తించి తక్షణమే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుపాను ప్రభావిత జిల్లాల్లోని 1.92 కోట్ల మందికి మొబైల్ ఫోన్ల ద్వారా హెచ్చరిక సందేశాలు పంపామని, 2,703 జనరేటర్లను సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. అత్యవసర కమ్యూనికేషన్ కోసం పోలీస్ శాఖ 81 టవర్లతో వైర్‌లెస్ వ్యవస్థను ఏర్పాటు చేసిందని వివరించారు.

ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ తుపాను కారణంగా రోడ్లపై చెట్లు, స్తంభాలు కూలిపోయి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో తాను ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నానని, యంత్రాంగమంతా క్షేత్రస్థాయిలో ఉందని మంత్రి నారా లోకేశ్ సీఎంకు తెలిపారు. రాయలసీమలో ప్రస్తుతం వర్షాలు లేనందున కృష్ణా నది ప్రవాహాలను అక్కడి చెరువులకు మళ్లించి, ఒక్క టీఎంసీ నీటిని కూడా వృథా చేయవద్దని జలవనరుల శాఖ అధికారులకు చంద్రబాబు సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు అనిత, నారాయణ, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మరో ఇద్దరు నక్సల్ కీలక నేతల సరెండర్

ప్రవంతిలోకి వస్తున్నామన్నారు. అయితే ఇది లొంగుబాటు కాదు, రాబోయే రోజుల్లో ప్రజల కోసమే వస్తున్నామని స్పష్టం చేశారు. తాము ఎలాంటి డబ్బులు ఆశించడం లేదన్నారు. చాలా మంది చనిపోయారు మా సిద్ధాంతం మేరకు ముందుకెళ్తున్నామని చెప్పుకొచ్చారు.

**మావోయిస్టు పార్టీలో చీలికలు**

మావోయిస్టు పార్టీలో అంతర్గత చీలికలు జరిగాయని సరెండర్ నక్సలైట్లు తెలిపారు. దేవోజి సీపీఐ మావోయిస్టు కార్యదర్శిగా ఉన్నారు, ఎవరి మార్గం వాళ్ళు ఎంచుకున్నారు, మేము ఎంచుకున్నామని బండి ప్రకాష్, చంద్రన్న తెలిపారు. సోని వర్గం మమ్మల్ని వ్యతిరేకేస్తోందని మాకు కూడ ప్రజాల మధ్య పనిచేసే క్యాడర్ ఉంది. దేశమంతా పనిచెయ్యడానికి ఉందని తెలిపారు. ఇప్పటివరకు ఉద్యమంలో పీడిత ప్రజల కోసమే పని చేశామని, భవిష్యత్తులో కూడా ప్రజల కోసమే పని చేస్తామని తెలిపారు. మా సిద్ధాంతం ఓడిపోలేదు, ఓడించడం ఎవరితరం కాదని వారు తెలిపారు. మా భావాజాలంతో భవిష్యత్తులో మరింత మంది ముందుకు వచ్చే అవకాశం ఉందని, ప్రజల మధ్య ఉండి సేవ చేయాలనుకున్నామన్నారు. ఆయుధాలను పార్టీకి ఇచ్చి వచ్చామని తెలిపారు.

**అందరూ సరెండర్ కావాలని డీజీపీ పిలుపు**

చంద్రన్నా, బండి ప్రకాశ్ అజ్ఞాతం వీడారని.. తెలంగాణ ప్రభుత్వం పిలుపు మేరకు అజ్ఞాతం నుండి బయటికి వచ్చి జనజీవన ప్రవంతి లో కలిశారని డీజీపీ శివధర్ రెడ్డి ప్రకటించారు. పుల్లూరి ప్రసాద్ రావ్ ఏ చంద్రన్నా ది పెద్దపల్లి మండలం, 15 ఏళ్ల కేంద్ర కమిటీ సభ్యుడి గా ఉన్నాడు. మొదట రాడికల్ స్టూడెంట్ గా తన ప్రస్థానాన్ని స్టార్ట్ చేశాడు . 1980 లో కిషన్ జీ కి కొరియర్ గా చేశాడు. 2008 లోనే కేంద్ర కమిటీ మెంబర్ గా చంద్రన్న ఉన్నాడు.

2024 డిసెంబర్ వరకు తెలంగాణ స్టేట్ కమిటీ సెక్రటరీ గా ఉన్నాడని డీజీపీ తెలిపారు. అక్టోబర్ 21 నాడు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు చంద్రన్న జన జీవన ప్రవంతి లో కలిశాడని చంద్రన్నా ఆరోగ్యం కూడా సహకరించకాపోవడం తో అజ్ఞాతం వీడారన్నారు.

# మూసీ నది సుందరీకరణ ప్రాజెక్ట్ లో కీలక ముందడుగు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. మూసీ నది సుందరీకరణ, అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా 734.07 భూమిని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎంఆర్డీసీఎల్) కు బదలాయించేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ నిర్ణయంతో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్ మెంట్ ప్రాజెక్ట్(ఎంఆర్డీపీ) పనులు మరింత వేగవంతం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం బదలాయించే భూములు రంగారెడ్డి జిల్లాలోని నాలుగు మండలాల్లో విస్తరించి ఉన్నాయి. హిమాయత్ సాగర్ లోని ఈసా నది వద్ద, గండిపేట మండలంలోని కిస్మత్ పూర్, రాజేంద్రనగర్ మండలంలోని ప్రేమావతి నగర్, బద్వేల్, శంషాబాద్ మండలంలోని కొత్వాల్ గూడలో హెచ్ ఎండీ ఏ లే అవుట్ ల కోసం కేటాయించిన ఈ భూములను బదలాయించారు. మూసీ నది సుందరీకరణతోపాటు రివర్ ఫ్రంట్ కారిడార్ అభివృద్ధిని చేపట్టనుంది రాష్ట్ర ప్రభుత్వం. ఈ క్రమంలో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్డీసీఎల్) కు 734.07 ఎకరాల భూమిని బదలాయిస్తూ భూపరిపాలన ప్రధాన కమిషనర్ లోకేశ్ కుమార్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పలు ప్రభుత్వ రంగ సంస్థలకు కేటాయించిన భూములను సైతం మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్డీసీఎల్) కు బదలాయించారు. టీఈఈఆర్ ఎల్(129.39 ఎకరాలు), ఐఐపీహెచ్(41.27ఎకరాలు), వాలంతరి(219.09 ఎకరాలు) వంటి సంస్థలకు కేటాయించిన భూములతో పాటు, శంషాబాద్ మండలం కొత్వాల్ గూడలో హెచ్ఎండీఏ లేఅవుట్ కోసం కేటాయించిన భూమిని కూడా మూసీ ప్రాజెక్టు కోసం బదలాయించారు. ఇక భూములు కోల్పోయిన సంస్థలకు ఫ్యూచర్ సిటీ, శంషాబాద్ మండలంలో ప్రత్యామ్నాయ భూమిని కేటాయించాలని అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇక మూసీ సుందరీకరణ, అభివృద్ధి కోసం ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) నుంచి రూ. 4,100 కోట్ల రుణం పొందేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిన విషయం తెలిసిందే. ఇక మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్ మెంట్ ప్రాజెక్ట్(ఎంఆర్డీపీ) లో భాగంగా మూసీ నదిలో పేరుకుపోయిన చెత్తను తీసి పూడికలు తీసి శుభ్రం చేయడం మూసీ నదికి రెండు వైపులా 110 కిలోమీటర్లు మేర అభివృద్ధి చేస్తారు. అలాగే ప్రాజెక్ట్ లో భాగంగా నదికి రెండు వైపులా రోడ్లు, సైకిల్ ట్రాక్ లు, వాకింగ్ వే లు, పార్కులు, పచ్చని ప్రదేశాలను ఏర్పాటు చేయనుంది.

# ఎనిమిదో వేతన సంఘానికి కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)

దాదాపు కోటి మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు గుడ్ న్యూస్. కేంద్ర ప్రభుత్వం మంగళవారం నాడు ఎనిమిదో వేతన సంఘాన్ని అధికారికంగా ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపింది. ఎన్సీ – జీసీఎం (స్టాఫ్ సైడ్) సెక్రటరీ శివ గోపాల్ మిశ్రా మాట్లాడుతూ, ఎనిమిదవ వేతన సంఘాన్ని అమలు చేయడంలో ఆలస్యం కావచ్చు, కాని ఇది జనవరి 1, 2026 నుంచ అమలులోకి వస్తుంది. అంటే, ఆలస్యం జరిగితే, జనవరి 1, 2026 నుంచి సిబ్బందికి బకాయిలు కలిపి చెల్లించవచ్చు. 10 మిలియన్లకు పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు మరియు పెన్షనర్లకు పెద్ద వార్త. కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఎనిమిదవ వేతన సంఘం ఏర్పాటుకు అధికారికంగా ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజనా ప్రకాష్ దేశాయ్ కమిషన్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తుండగా, ఐఐఎం బెంగళూరు ప్రొఫెసర్ పులక్ ఘోష్, పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి పంకజ్ జైన్ సభ్యులుగా నియమితులయ్యారు.

**సిఫార్సులు పంపడానికి 18 నెలల సమయం**

కమిషన్ రాబోయే 18 నెలల్లో ప్రభుత్వానికి తన సిఫార్సులను సమర్పిస్తుంది, ఆ తర్వాత 2027 నుంచి జీతం, పెన్షన్ పెంపుదల అమలు చేయవచ్చు. ఎనిమిదో వేతన సంఘం కోసం నిబంధనలను ఆమోదించినట్లు క్యాబినెట్ సమావేశం తర్వాత విడుదల చేసిన ప్రెస్ నోట్‌లో పేర్కొంది. వేతన సంఘంలో చైర్మన్, సభ్యుడు (పార్ట్-టైమ్), సభ్య కార్యదర్శి ఉంటారు. వేతన సంఘం ఏర్పడినప్పటి నుంచి పద్దెనిమిది నెలల పాటు దాని సిఫార్సులను సమర్పించడానికి సమయం ఇచ్చారు. 8వ వేతన సంఘం అమలులో జాప్యం జరిగే అవకాశం ఉన్నప్పటికీ, అది జనవరి 1, 2026 నుంచి అమలులోకి వస్తుందని ఎన్సీ – జీసీఎం (స్టాఫ్ సైడ్) కార్యదర్శి శివ్ గోపాల్ మిశ్రా చెబుతున్నారు. దీని అర్థం ఆలస్యం అయితే, జనవరి 1, 2026 నుంచి బకాయిలను జోడించి సిబ్బందికి చెల్లించవచ్చు.

**2027లో బకాయిలతో జీతం పెంపు!**

గతంలో, ఏడో వేతన సంఘం అమలు చేసినప్పుడు, ఆలస్యం జరిగింది. అన్ని ఉద్యోగులు, పెన్షనర్లకు బకాయిలు చెల్లించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు మరియు పెన్షనర్లకు ప్రాతినిధ్యం వహించే ఫోరమ్ అయిన ఎన్సీ – జీసీఎం జనవరిలో కేంద్ర ప్రభుత్వానికి ఒక నిబంధనలను సమర్పించింది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఇతర అంశాల దృష్ట్యా, ప్రతి 10 సంవత్సరాలకు ఒక కొత్త వేతన సంఘం ఏర్పడుతుందని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, భత్యాలు, ఇతర ప్రయోజనాలను సవరిస్తున్నారని గమనించాలి. దీని ప్రకారం, ఎనిమిదవ వేతన సంఘం జనవరి 1, 2006 నుంచి అమలులోకి వస్తుంది. ఎనిమిదవ వేతన సంఘం ఏర్పాటును ఈ సంవత్సరం జనవరిలో ప్రకటించారు, కానీ కేంద్ర మంత్రివర్గం నుంచి ఆమోదం పొందడానికి దాదాపు 10 నెలలు పట్టింది. ఈ ఆలస్యం ప్రభుత్వ ఉద్యోగులు మరియు వారి సంఘాలలో అసంతృప్తి స్వరాలకు దారితీసింది.

## సాక్షులను బెదిరిస్తే ఇకపై నేరుగా ఎఫ్ఐఆర్

చేసుకునే అవకాశాన్ని ఒక అదనపు పరిహార మార్గంగా మాత్రమే కల్పిస్తోందని స్పష్టం చేసింది. అందులో వాడిన 'చేయవచ్చు' (మే) అనే పదం, బాధితులు కేవలం మేజిస్ట్రేట్‌ను మాత్రమే ఆశ్రయించాలనే నిబంధన తప్పనిసరి కాదని సూచిస్తోందని పేర్కొంది.

ఈ తీర్పుతో, 2023 ఏప్రిల్ 4 నాటి కేరళ హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టు పక్కనపెట్టింది. నిందితుడిని రెండు వారాల్లోగా ట్రయల్ కోర్టు ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. అయితే, ఇతర కారణాలపై బెయిల్ కోసం మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు అతడికి అవకాశం ఉందని స్పష్టం చేసింది. అదేవిధంగా, యోగేష్ గౌడర్ హత్య కేసుకు సంబంధించి సీబీఐ ఫిర్యాదుపై ధార్వాడ్ మేజిస్ట్రేట్ 2020లో జారీ చేసిన ఆదేశాలను పునరుద్ధరించింది. ఈ కేసును కొట్టివేస్తూ కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. ఈ విషయంలో కేరళ, కర్ణాటక హైకోర్టుల వ్యాఖ్యానాలు "తప్పులతో కూడినవి, నిలకడలేనివి" అని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

## హాలివుడ్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తా

ముఖ్యమంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలుగు సినిమాను ప్రపంచ సినిమాకు కేరాఫ్ అడ్రస్‌గా మారుస్తామని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలుగు చిత్ర పరిశ్రమ చరిత్రను గుర్తు చేస్తూ పరిశ్రమ అభివృద్ధికి గత నాయకులు చేసిన కృషిని కొనియాడారు. ఒకప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమను 'మదరాసి' అని పిలిచేవారని ఆనాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి ఈ పరిశ్రమను హైదరాబాద్‌కు తరలించడానికి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు వంటి దిగ్గజ నటుల సహకారంతోనే పరిశ్రమ హైదరాబాద్‌లో స్థిరపడిందని తెలిపారు. కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే తక్కువ ధరకే భూములు ఇచ్చారని అలాగే నంది అవార్డుల కార్యక్రమాన్ని 1964లో ప్రారంభించారని గుర్తు చేస్తూ చిత్రపురి కాలనీ అభివృద్ధిలో నాటి నాయకుల కృషిని మర్చిపోకూడదని చెప్పారు.

**సినీ కార్మికుల సంక్షేమం..**

తెలుగు సినిమా నేడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతూ ఆస్కార్ స్థాయికి ఎదుగుతోందంటే దాని వెనుక సినీ కార్మికుల కృషి ఎంతో ఉందని సీఎం ప్రశంసించారు. తనకు సినీ కార్మికుల కష్టాలు తెలుసని వారిని పట్టించుకోనంత స్థాయికి తాను ఇంకా వెళ్లలేదని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. నటుడు ప్రభాకర్ రెడ్డి కార్మికుల కోసం తన సొంత 10 ఎకరాల భూమిని ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. తమ ప్రభుత్వ లక్ష్యం 'ప్రపంచ సినిమాకు హైదరాబాద్ కేరాఫ్ కావాలి' అని స్పష్టం చేశారు. సినీ కార్మికులు అండగా ఉంటే హాలీవుడ్‌ను కూడా హైదరాబాద్‌కు తీసుకొస్తామని ఆయన ధైర్యం చెప్పారు. సినీ పరిశ్రమ కోసం ఫ్యూచర్ సిటీలో స్థలాల కేటాయింపు, కార్మికుల పిల్లల కోసం ప్రత్యేక పాఠశాలల నిర్మాణం వంటి కీలక పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గద్దర్ అవార్డులను ప్రారంభించామని తెలిపారుద

## జిల్లాల పునర్విభజనపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి (ప్రశ్న న్యూస్)ఏపీలో ప్రస్తుతం ఉన్న జిల్లాలను పునర్ వ్యవస్థీకరించి కొత్త జిల్లాల ఏర్పాటు కోసం ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం నియమించిన కేబినెట్ సబ్ కమిటీ సీఎం చంద్రబాబుతో సమావేశమైంది. ఆయనకు జిల్లాల్లో పర్యటనలు, ఇతర మార్గాల్లో సేకరించిన వివరాలను అందించింది. అలాగే కొత్త జిల్లాలపై ఉన్న డిమాండ్లు, ఇతర పరిస్థితుల్ని కూడా వివరించింది. అనంతరం సీఎం చంద్రబాబు కొత్త జిల్లాల ఏర్పాటుపై వారికి క్లారిటీ ఇచ్చేశారు.

రాష్ట్రంలో చేపట్టిన జిల్లాల పునర్ వ్యవస్థీకరణతో ప్రజల ఆకాంక్షలు నెరవేరి, పరిపాలనా సౌలభ్యం కలగాలని మంత్రులు, అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కొత్త జిల్లాల ఏర్పాటుతో తలెత్తిన సమస్యలు పరిష్కారం కావాలని, అదే సమయంలో కొత్త ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని సీఎం చెప్పారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై ఈ ఏడాది జూలై 22న ఏడుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సీఎం చంద్రబాబుతో భేటీ అయింది. వీరితో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఉన్నారు. గత ప్రభుత్వంలో అశాస్త్రీయంగా జరిగిన కొత్త జిల్లాల ఏర్పాటును సరిదిద్దేలా జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణకు సంబంధించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపైనా, కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపైనా సీఎం చర్చించారు. కొత్త జిల్లాల ఏర్పాటుపై గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం ప్రాంతీయ విభేదాలకు కారణమైందని, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదని ముఖ్యమంత్రి అన్నారు. మరోవైపు భవిష్యత్‌లో చేపట్టే నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని జిల్లాల పునర్ వ్యవస్థీకరణ జరగాలని నిర్దేశించారు. రెవెన్యూ డివిజన్ల పునర్వ్యవస్థీకరణను ప్రత్యేకంగా చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పోలవరం పూర్తయిన తర్వాత ముంపు మండలాల ప్రజలు ఏ రెవెన్యూ వార్డు, ఏ నియోజకవర్గంలో ఉంటారనేదానిపైనా అధ్యయనం చేసి దానికి అనుగుణంగా పునర్ వ్యవస్థీకరణ జరపాలన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు ఆ ప్రాంత చిరకాల వాంఛ అని సీఎం ప్రస్తావించారు. తమ పరిశీలనకు వచ్చిన అంశాలను, ఆయా వర్గాల అభిప్రాయాలను మంత్రులు ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై తొలి సమావేశంలో పలు అంశాలు చర్చించిన సీఎం ప్రతిపాదనలపై తదుపరి చర్చలకు వారంలో మరోసారి సమావేశం అవుదామని తెలిపారు.

## బ్యారేజీల మరమ్మత్తులకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయండి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలోని నీటి పారుదల ప్రాజెక్టులన్నింటిపైనా సమగ్రమైన అధ్యయనం పూర్తి చేసి నివేదికలను తయారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల వారిగా విశ్లేషణలు జరగాలని స్పష్టంగా చెప్పారు. వివరాలు 'కాంప్రహెన్సివ్ డ్యామ్ సేఫ్టీ ఎవల్యూషన్' (సీడీఎస్ఈ) కు సంబంధించి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఇటీవల రాసిన లేఖపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు. నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ లేఖలో ప్రస్తావించిన అంవాలను ఈ సమావేశంలో చర్చించారు. అందుకు అనుగుణంగా ప్రాజెక్టుల వారిగా సమగ్రమైన వివరాలతో విశ్లేషణలు జరగాలని, రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌లపైనా స్టేటస్ రిపోర్ట్‌లను తయారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితిపైనా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. బ్యారేజీల మరమ్మత్తులకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇందుకు సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలని అధికారులకు చెప్పారు. ప్రాజెక్టుల వారీగా రూపొందించే పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు.

తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80 టీఎంసీల నీటిని తరలించడానికి వీలుగా ప్రాజెక్టుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. తుమ్మిడిహట్టి వద్ద చేపట్టాల్సిన ప్రాజెక్టుపై సమీక్షలో చర్చించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు, తాగునీరు అందించే విధంగా ఈ ప్రణాళికలు సిద్ధం కావాలని చెప్పారు. ఇందుకు పాత పనులను ఉపయోగించుకుంటూ ముందుకు వెళ్లేందుకు వీలుగా అంచనాలను తయారు చేయాలని సూచించారు. సుందిళ్ల బ్యారేజ్ మరమ్మత్తు చేసి వినియోగంలోకి తీసుకొచ్చి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని కూడా అధికారులను ఆదేశించారు.

## కబ్జా నుంచి 1.27 ఎకరాల స్థలాన్ని కాపాడిన హైడ్రా

తర్వాత ప్లాట్లుగా విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో విచారిణ జరిపి ఆక్రమణలను తొలగించారు. చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ఆక్రమణకు గురికాకుండా కాపాడినట్లు తెలియజేస్తూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. అదేవిధంగా, శేరిలింగంపల్లి జోన్, చందానగర్ సర్కిల్ పరిధిలోని గంగారాం కాలనీలో సుభాష్ నగర్ పేరుతో 1974లో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ లే అవుట్ వేసింది. ఇందులో 700 గజాల స్థలాన్ని ప్రజావసరాల కోసం కేటాయించారు. పేద ప్రజల కోసం ఉద్దేశించిన లే అవుట్‌లో కొందరు బడాబాబులు ఆక్రమణలకు పాల్పడ్డారు. ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాన్ని ప్లాటుగా మార్చారు. ఈ ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ అక్కడి నివాసితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, హైడ్రా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
బుధవారం 29 అక్టోబర్2025

## ఘనంగా పొంగులేటి జన్మదిన వేడుకలు..!

### - ముఖ్య అతిథిగా పాల్గొన్న. బోర్ర రాజశేఖర్.



తల్లాడ, అక్టోబర్ 28 (ప్రశ్నన్యూస్) : రాష్ట్ర మంత్రి వర్యులు పొంగులేటి శీనన్న పుట్టినరోజు సందర్భంగా ఐ ఎన్ టి యు సి మిషన్ భగీరథ వైరా సబ్ డివిజన్ అధ్యక్షుడు పరస రవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ మార్కెట్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ పాల్గొనడం జరిగింది. తదనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ యంగ్ డైనమిక్ బడుగు బలహీనత వర్గాల ఆశాజ్యోతి ఆపదలో ఏ కష్టం వచ్చినా నేనున్నాను అంటూ భరోసాని నిచ్చే ఏకైక వ్యక్తి ఖమ్మం జిల్లా ముద్దుబిడ్డ మన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అని అభివర్ణించారు. తదినంతరము కేక్ కట్ చేసి పలువరకు స్వీట్స్ పంపిణీ చేశారు. ఇట్టి కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి రాష్ట్ర అధ్యక్షులు తలారి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుబోతు బాలకృష్ణ, సహాయ కార్యదర్శి గొడ్ల నరసింహారావు, కోపూరి నాగేశ్వరరావు, జిల్లా ట్రెజరీ సితారు రాజబాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ లగడపాటి జోగారావు, ప్రచార కమిటీ బాద్యులు ఏదునూరి సురేష్, మెరుగు హరికృష్ణ, సంగిశెట్టి శ్రీను, పటాన్ సైదులు ఖాన్, పరస పిచ్చయ్య, మడుపల్లి రాంబాబు, మస్కట్ల రవి, శిరసాని నరేష్, తాలూరి నవీన్, మూడుముంతల గోపి, అక్రము, లక్ష్మణ,వెంకటేశ్వర్లు, సురేష్ , జలాది రాజేష్, కొండయ్య, సాయి గణేష్, చిలక సైదులు, పర్సా శీను, మొదలకు కార్మిక సోదరులు ఈ కార్యక్రమంలో పాల్గొనటం జరిగింది.

## రాచకొండ జోన్ పరిధిలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

### సైకిల్ ర్యాలీలలో ఉత్సాహంగా పాల్గొన్న పోలీసు అధికారులు






హైదరాబాద్(ప్రశ్న న్యూస్)పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఆదేశాల మేరకు రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్, యాదాద్రి భువనగిరి, మల్కాజిగిరి, మహేశ్వరం జోన్ ల డీసీపీల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. ఈ వారం రోజుల్లో రాచకొండలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ లు, ఎస్సే రైటింగ్ కాంపిటీషన్, షార్ట్ ఫిలిం కాంపిటీషన్, ఫోటోగ్రఫీ కాంపిటీషన్ నిర్వహించారు.

ఈ ర్యాలీలలో పోలీసులతో పాటు ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారికి డయల్ -100, రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలు, పోక్సో చట్టం, సీసీ కెమెరాల ఉపయోగాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అక్టోబర్ 21 నుండి ఈనెల వరకు 31 వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసులకి పది రోజులపాటు సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారని అధికారులు తెలిపారు. అలాగే రోడ్డు భద్రత గురించి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేయవద్దని, లైసెన్స్, రిజిస్ట్రేషన్ లేని వాహనాలను నడపవద్దని సూచించారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలను నడపకూడదని హెచ్చరించారు. ప్రమాదం జరిగినప్పుడు బాధితులకు ప్రథమ చికిత్స అందించడం గురించి, అలాగే గ్రామాల్లో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు.సైబర్ నేరాల గురించి ప్రజలను అప్రమత్తం చేస్తూ, ఎవరైనా మోసాలకు గురైనప్పుడు వెంటనే 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు విద్యార్థులు ఉత్సావంతంగా పాల్గొని పోలీసులకు నివాళులు అర్పించారు.

## కోటిలింగాల మార్పు ప్రయత్నాలను విరమించాలి %-% బీజేపీ డిమాండ్

### దర్గాను తొలగించిన తర్వాతే అభివృద్ధి పనులు చేపట్టాలి

### భాజపా జిల్లా అధ్యక్షులు : రెడ్డబోయిన గోపీ



వేములవాడ (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి పనుల పేరుతో కోటిలింగాలను తరలించే ప్రయత్నం చేయడం హిందువుల మనోభావాలను దెబ్బతీస్తుందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపీ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు.జిల్లా కలెక్టర్ గరీమా అగ్రవాల్ (వీటీడీఏ వైస్ చైర్మన్) పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో కోటిలింగాలను మార్చే ప్రక్రియ ప్రారంభమవుతుండగా, అదే ప్రాంగణంలో ఇతర మతస్తుల నిర్మాణాలు ఉన్నప్పటికీ వాటిని యథావిధిగా వదిలేయడం వివక్షతపూరితమని ఆయన పేర్కొన్నారు. ముందుగా అక్కడి దర్గాను తొలగించి, ఆపై అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బండ మల్లేశం,సంతోష్ రెడ్డి, బీజెవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజు రెడ్డి, జిల్లా కార్యదర్శి గొప్పడి సురేందర్‌రావు, జిల్లా మీడియా కన్వీనర్ కాసుగంటి రాజు రావు, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, మండల అధ్యక్షులు వేణుగోపాలరావు, కోడె రమేష్, మీరాల్కర్ బాలాజీ, వేములవాడ పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్, బూరుగుపల్లి పరమేష్, సొల క్రాంతి, పార్టీ సీనియర్ నాయకులు గజ బింకర్ చందు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గిరిబాబు విస్తృత ప్రచారం..!!

**- డోర్ టు డోర్ తిరిగి ఓటర్లను కలుస్తూ. భరోసా ఇస్తున్న వైనం..**

**- మాగంటి సునీత గోపినాథ్ ని గెలిపించి ఆదరించాలని విజ్ఞప్తి..**







జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్ 28: వెంగళరావు నగర్ డివిజన్ లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ కు మద్దతుగా వైరా నియోజకవర్గ నాయకులు లకావత్ గిరిబాబు, ఇతర ముఖ్య నేతలు డోర్ టూ డోర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ హామీలు ఇచ్చి అధికారంలోకి వొచ్చిన అనంతరం ప్రజలను గాలికొదిలేసారని అధికార పార్టీ నాయకులు అసత్య ప్రచారాలతో పబ్బం గడుపుతున్నారని ప్రజలకు గిరిబాబు వివరిస్తూ మహిళలను వృద్ధులను అప్యాయంగా పలకరిస్తూ ఓటు అభ్యర్థించారు. మాగంటి సునీత గోపినాథ్, ఉత్సాహంగా పనిచేసే వ్యక్తి కాబట్టి ఆశీర్వదించి ఓటు వేయాలని కోరారు.

**- ఓటర్లలో ఉత్సాహం నింపుతున్న గిరిబాబు..!**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా వెంగళరావవు డివిజన్ లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు కూరాకుల నాగభూషణం, పగడాల నాగరాజుతో కలసి లకావత్ గిరిబాబు స్వయంగా కరపత్రాలు పంపిణీ చేస్తూ ఇంతకు ముందు బిఆర్ఎస్ ను ఆదరించినట్టే మరొకసారి ఆదరించి మాగంటి సునీత గోపినాథ్ ని గెలిపించాలాని, బిఆర్ఎస్ హయాంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు కెసిఆర్ నోటిఫికేషన్ ఇచ్చారని, నియామక ప్రక్రియ పూర్తయ్యేదశలో ఎన్నికల రావడంతో ఉద్యోగాలు కల్పించలేకపోయారాని గిరిబాబు ఓటర్లకు తెలిపారు. టిఆర్ఎస్ హయాంలో చేపట్టిన ఉద్యోగుల భర్తీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామ పత్రాలు అందించి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విజంగా చెప్పుకోవడం సిగ్గుచేటుగా ఉందని. గల్లీలో తిరుగుతూ బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం విశేషంగా కృషి చేస్తున్నారు. ఎంతో ఓపిగ్గా ఇంటింటికి తిరుగుతూ బిఆర్ఎస్ కు ఓటు వేయాల్సిన అవసరాన్ని వివరిస్తున్నారు.

**- మాగంటి సునీత గోపినాథ్ కి ఒక్కసారి ఛాన్సివ్వండి: గిరిబాబు.!**

వెంగలరావు డివిజన్లో ఇంటింటి ప్రచారంలో కాలనీ వాసులతో గిరిబాబు మాట్లాడుతూ. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని టిఆర్ఎస్ పార్టీ ప్రజల నుండి అపూర్వ ఆదరణ లభిస్తుందని కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ఈసారి సునీత గోపినాథ్ గెలిచే అవకాశం కల్పించాలని ప్రజలను కోరారు. అక్కా అంటే నేనున్నానంటూ అందరికీ అందుబాటులో ఉండే సునీత గోపినాథ్ ను గెలిపించుకోవాలని, దీంతో అభివృద్ధి కూడా వేగవంతం అవుతుందని గిరిబాబు స్పష్టం చేశారు. రెండు ఏళ్లలో ఎన్నో ఇబ్బులు ఎదురుకుంటున్నామని అవన్నీ తరిమికొట్టే అవకాశం జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల చేతుల్లోనే ఉందని, అందుకే బిఆర్ఎస్ గుర్తుకు ఓటేసి ఆదరించాలని గిరిబాబు పిలుపునిచ్చారు.

# నాసిరకానికి నిలువెత్తు సాక్ష్యం..!!







**- చిన్న పిల్లల ప్రాణాలతో చెలగాటం..**

**- దనార్జనే ప్రధాన ధ్యేయంగా నిర్మాణాలు..**

జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్ 28 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలపరిధిలోని పడమటి నరసాపురం అంగన్వాడీ స్కూల్ మరుగుదొడ్డి నిర్మాణంలో చూద్దామన్న ఎక్కడ నాణ్యత కనిపించకపోవడం గమనార్హం. నరసాపురం గ్రామంలో అంగన్వాడీ స్కూల్ పిల్లల కోసం మరుగుదొడ్డి నిర్మాణానికి అధికారులు పూనుకోవడం ఒక ఎత్తైతే దాదాపు 51వేల రూపాయల వ్యయంతో కొత్త మరుగుదొడ్డి నిర్మాణానికి కాంట్రాక్టర్ ను ఎంపిక చేసి పనులు మొదలుపెట్టిన దగ్గర నుండి నాణ్యత లోపం స్పష్టంగా కనిపించడం మరొక ఎత్తు. మరుగు దొడ్డి నిర్మాణంలో పునాదుల లేకుండా నాణ్యత పాటించకుండా నాసిరకం ఇసుక, సిమెంటులను వినియోగిస్తూ నిర్మాణం చేపట్టడంతో మరుగు దొడ్డి నిర్మాణం పూర్తికాకముందే కూలి పోయేలా నాణ్యత లోపాన్ని బట్ట బయలు చేస్తున్నాయి. ఒక్క రోజులోనే దాదాపు పూర్తయిన దశలో గోడలు ముట్టుకుంటేనే పెచ్చులూడుతూ కూలి పోతుండడంతో కాంట్రాక్టర్ ఏ మేర చేతివాటం ప్రదర్శించాడో తెలుస్తోంది. ఇక నిర్మాణంలో ఉపయోగించిన ఇసుకలో తక్కువ సిమెంట్ తో వాడటం, పునాది లేకుండా, కాంక్రీట్ పోయాకుండా ఒక్క రోజు మూడు గంటల్లో తూ తూ మంత్రంగా పనులు చేస్తూ నిబంధనల ఊసే లేకుండా నిర్మించడం పై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 51వేల వ్యయంతో నిర్మించే మరుగు దొడ్డి నిర్మాణాన్ని చూసి విద్యార్థుల తల్లిదండ్రులు ముక్కున వేలేసుకుంటున్నారు. మండలవ్యాప్తంగా 16 మరుగు దొడ్లు ఇలానే నిర్మిస్తున్నారా.? పంచాయతీ రాజ్ శాఖ అధికారులు నిద్దర పోతున్నారా? అని పిల్లల తల్లి దండ్రులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**చిన్న పిల్లలకు ఏది భద్రత..?**

నాసిరకం నిర్మాణాలు చేస్తూ అంగన్వాడీ స్కూల్ ఆవరణలో మరుగుదొడ్డి నిర్మిస్తున్న కాంట్రాక్టర్ ముట్టుకుంటేనే గోడలు ఊగుతూ, నిర్మాణం పూర్తికాకుండానే పట్టుకుంటే పడిపోయే మరుగు దొడ్లు పిల్లలకు ఎంతవరకు భద్రత ఉంటుందని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. నాసిరకం పనులు చేస్తున్న కాంట్రాక్టర్ కు అధికారులు తోడై నిర్మాణాల పట్ల నిబంధనలు పాటించకుండా ఇష్టరీతిన నిర్మిస్తూ ప్రభుత్వ సొమ్మును కాజేస్తున్నారని, నాసిరకం నిర్మాణాలు చేసే సదరు కాంట్రాక్టర్ పై ఇకనైనా అధికారులు చర్యలు తీసుకుని నాసిరకంగా నిర్మించిన గోడలు పడగొట్టి తిరిగి పటిష్టంగా నిర్మించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. లేని పక్షంలో ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని గ్రామస్తులు తెలిపారు.

# రానున్న మూడు రోజులు తుఫాను ప్రభావం

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) కౌడిపల్లి మండలం మహమ్మద్ నగర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డిఓ మహిపాల్ రెడ్డి డి.ఎస్.ఓ, నిత్యానంద్ డి ఎం సి ఎస్.జగదీష్ తాసిల్దార్ ఎంపీడీవో మండల వ్యవసాయ శాఖ అధికారులు తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పకడ్బందీ టీము వర్కుతో రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా కొనుగోలు చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో తుఫాను ప్రభావంతో జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాను తీవ్రత తగ్గేవరకు. కోతలు వాయిదా వేయడం వల్ల ధాన్యం పాడవకుండా ఉంటుందని, కోతలు కోయకుండా ఉంటే పంట త్వరగా ఆరడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం రవాణా చేయాలని ఆదేశించారు. ధాన్యం రక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆరుబయట ఉన్న ధాన్యం తడవకుండా రక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. . అన్ని కొనుగోలు కేంద్రాల్లో టార్పలిన్స్ టా రైతులకు అందుబాటులో ఉంచాలని అన్ని సౌకర్యాలు కల్పించాలని సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు. రాబోయే మూడు రోజుల్లో తుఫాను ప్రభావం ఉండే అవకాశం ఉందని రైతులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇప్పటివరకు జిల్లాలో 8,442 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని మరింత వేగవంతం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
బుధవారం 29 అక్టోబర్2025

## తన్నీరు సత్యనారాయణ రావుకు నివాళులర్పించిన బిఆర్ఎస్ నాయకులు



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మంగళవారం ఉదయం అనారోగ్యంతో మరణించారు. మాజీ మంత్రి నివాసం హైదరాబాదులోని కోకాపేటలో తన్నీరు సత్యనారాయణ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కొల్చారం మండలం మాజీ జడ్పీటిసి ముత్యం గారి మేఘమాల సంతోష్ కుమార్ కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షులు కోనాపూర్ సంతోష్ రావు అనంతరం హరీష్ రావు ని పరామర్శించి,వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించని ఆ భగవంతుని ప్రార్థించారు.

## పోలీసు సేవల్లో మల్లేష్ నిబద్ధత ప్రశంసనీయం

**- బోయినిపల్లి ఎస్సై : రమాకాంత్**

**- బదిలీపై వెళ్తున్న ఎఎస్ఐ మల్లేష్‌కు ఘన సన్మానం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఆర్.మల్లేష్ బదిలీపై కరీంనగర్ కమిషనరేట్‌కు వెళ్తుండగా మంగళవారం ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఎన్. రమాకాంత్ ఏఎస్ఐ మల్లేష్‌ను శాలువాతో సన్మానించి, ఆయన సేవలను ప్రశంసించారు.ఈ సందర్భంగా ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ "మల్లేష్ క్రమశిక్షణ, కృషి,కట్టుదిట్టమైన పనితీరుతో అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఆయనతో కలిసి పనిచేయడం మాకు గౌరవంగా అనిపించింది. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో విధుల్లో ఆయన మరింత విజయం సాధించాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొని ఏఎస్ఐ మల్లేష్ భవిష్యత్ బాధ్యతల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు.ం

## పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో రక్తదానం చేసిన మైలారం రాము

**జిల్లా ఎస్పీ మహేష్ బి గితే చేతులమీదుగా ప్రశంసా పత్రం అందజేత**





వేములవాడ (ప్రశ్న న్యూస్)పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) లో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఎస్పీ మహేష్ బి గితే నేతృత్వంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రజక సంఘం పూర్వ కన్వీనర్,వేములవాడ పట్టణ కాంగ్రెస్ నాయకుడు మైలారం రాము స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ, "సమాజ సేవ పట్ల మైలారం రాము చూపిన త్యాగస్ఫూర్తి ప్రశంసనీయం" అని అభినందిస్తూ ఆయనకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా పొంగులేటి జన్మదిన వేడుకలు..!



జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్ 28: రాష్ట్ర మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు సందర్భంగా కాకర్ల గ్రామ ప్రజలు, సీనియర్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యంగ్ డైనమిక్ బడుగు బలహీనత వర్గాల ఆశాజ్యోతి ఆపదలో ఏ కష్టం వచ్చినా నేనున్నాను అంటూ భరోసాని నిచ్చే ఏకైక వ్యక్తి ఖమ్మం జిల్లా ముద్దుబిడ్డ మన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అని అభివర్ణించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చావా వెంకటరామారావు, అల్లాడి లింగారావు, ముత్తినేని నరసింహారావు, ముత్తినేని గోపి, చంగాల నాగేష్, మంద కాంతయ్య, గాడిదేశి రాములు పాలాది శివ, అన్నపురెడ్డి నాగేంద్ర బాబు, చల్లా వెంకటనారాయణ అన్నపురెడ్డి చిన్న గోపి పిట్ల గోపాల్‌రావు చిమట సాయిగణేష్ రాజబోయిన అశోక్ చిమట నవీన్ చిమట కృష్ణారావు పడిమల రామకృష్ణ గోసు రామకృష్ణ తదితరుల నాయకులు పాల్గొన్నారు.

# దర్గా-కోటిలింగాల అంశంపై స్పష్టత ఇవ్వాలి

**- బీజేపీ జిల్లా పూర్వ అధ్యక్షులు : ప్రతాపరామకృష్ణ**

**- అభివృద్ధి పేరుతో భక్తుల మనోభావాలను దెబ్బతీయొద్దని హెచ్చరిక**



వేములవాడ (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలో జరుగుతున్న ఆలయ అభివృద్ధి పనులపై భక్తుల్లో సందేహాలు, ఆందోళనలు కలిగిస్తున్నాయని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ "అభివృద్ధి పేరుతో భక్తుల మనోభావాలతో ఆడుకోవడం తగదని తీవ్రంగా విమర్శించారు."గత నాలుగు, ఐదు నెలలుగా దేవాలయ పునర్నిర్మాణ పనులు ఎప్పుడు మొదలవుతాయి, ఎప్పుడు పూర్తవుతాయి అనే విషయంపై అధికారులు ఎటువంటి స్పష్టత ఇవ్వడం లేదు. దేవాదాయ శాఖ కూడా భక్తులకు సమాచారం ఇవ్వడం లేదు. అధికార పార్టీ మాత్రం బీజేపీని అభివృద్ధికి అడ్డుగా చూపుతూ తప్పుడు ప్రచారం చేస్తోంది. కానీ మేము ఎట్టి పరిస్థితుల్లోనూ అభివృద్ధికి వ్యతిరేకం కాదని స్పష్టం చేస్తున్నాం" అని అన్నారు.మే 14న అఖిలపక్ష బంద్ సందర్భంగా భక్తులకు కనీసం రెండు మూడు గంటల దర్శన సమయం కల్పించాలని డిమాండ్ చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు."కోటిలింగాలను తొలగించే ఆలోచన హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. అదే సమయంలో దర్గాను అలాగే ఉంచి కోటిలింగాలను తొలగిస్తే మతపరమైన ఉద్రిక్తతలు తలెత్తే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ రెండు అంశాలపై సమానంగా నిర్ణయం తీసుకోవాలి. లేకుంటే కోట్లాది హిందువుల ఆత్మగౌరవం దెబ్బతింటుంది" అని ప్రతాప రామకృష్ణ హెచ్చరించారు.దేవాదాయ శాఖ సెక్యులర్ శాఖనా లేక మతపరమైన శాఖనా? అని ప్రశ్నించిన ఆయన, "పవర్ ప్రెజెంటేషన్ సమయంలో కూడా అధికారులు దర్గా అంశంపై ఎలాంటి వివరణ ఇవ్వలేదు. దీంతో భక్తుల్లో అనుమానాలు పెరుగుతున్నాయి" అని విమర్శించారు."వేములవాడలో హిందూ, ముస్లిం వర్గాలు శతాబ్దాలుగా సామరస్యంగా జీవిస్తున్నా, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఆ సామరస్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఈ అంశంపై స్పందించాలి" అని సూచించారు.భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా, రెండు వర్గాల మధ్య సమతౌల్యం ఉండేలా ప్రభుత్వం వ్యవహరించాలని డిమాండ్ చేశారు. "దేవాదాయ శాఖ ఒక వారం రోజుల్లో దర్గా అంశంపై స్పష్టత ఇవ్వాలి. లేనిపక్షంలో బీజేపీ భవిష్యత్ కార్యాచరణలో రాజీ ఉండదు. అవసరమైతే మళ్లీ వేములవాడ బంద్ పిలుపునిస్తాం" అని హెచ్చరించారు.ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్, రేగుల మల్లిఖార్జున్, సంటి మహేష్, వివేక్ రెడ్డి, సాయి, బిల్లా కృష్ణ, మహంకాళి శ్రీనివాస్, రేగుల రాజ్ కుమార్, రేనికిండి అశోక్, కటకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కురిక్యాల ఘటన సమాజానికి తీరని మచ్చ

**-బాధిత చిన్నారులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటా**

**- పాఠశాలల్లో భద్రతా చర్యలు పటిష్టం చేయాలి - బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**- ప్రముఖ సామాజిక వేత్త : తూడి లచ్చన్న**



గంగాధర (ప్రశ్న న్యూస్)కరీంనగర్ జిల్లా,గంగాధర మండలం మల్లాపూర్ కు చెందిన ప్రముఖ సామాజిక వేత్త, టీఎల్ యువసేన అధినేత తూడి లచ్చన్న కురిక్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికల బాత్రూమ్‌లో కెమెరా వ్యవహారం వెలుగులోకి రావడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బాలికల గౌరవం, భద్రత పట్ల నిర్లక్ష్యం చూపిన ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ఇలాంటి సంఘటనలు సమాజాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేస్తున్నాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యులపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో విద్యార్థుల భద్రతను నిర్ధారించేందుకు తగిన చర్యలు చేపట్టాలని తూడి లచ్చన్న డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సీసీ కెమెరాలు,భద్రతా చర్యలను పటిష్టం చేయాలని అన్నారు. బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగే వరకు తాను వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

# ఆస్తి తగదమే మృతికి కారణమా..?

**వృద్ధురాలు ఆత్మహత్య పై పలు అనుమానాలు..?**
**మృతి పై వివిధ కోణాల్లో అనుమానాలు వ్యక్తం..**
**విచారణ చేశారా...? లేక కుటుంబ సభ్యులు చెప్పారని కేసు నమోదు చేశారా..?**
**కుటుంబ సభ్యులపై పలు అనుమానాలు..?**
**మృతి పై దళిత సంఘాలు ,స్థానికుల నుండి అనుమానాలు...**
**కుటుంబ సభ్యుల పిర్యాదు..**
**కేసు నమోదు చేసిన పోలీసులు**



మంథని ( ప్రశ్న న్యూస్)మంథని పట్టణంలో ఓ వృద్ధు రాలు పెట్రోల్ పోసుకొని మృతి చెందిన సంఘటన కలకలం రేపింది. పట్టణంలోనీ కూరగాయల మార్కెట్ ప్రాంతములో స్వంత ఇంటిలో పెట్రోల్ మీద పోసుకొని మృతి మృతి చెందిన సంఘటన చూస్తే స్థానికంగా ఒక్కసారిగా ఉలిక్కి పడేలా చేసింది. వృద్ధురాలిది హత్యానా..? ఆత్మ హత్యానా..? అనేది స్థానికంగా పలు అనుమానాలకు తావిస్తుంది. మృతికి ఆస్తి తగదమే కారణమా..? లేక మరేదైన కారణము ఉందా..? అనే కోణాల్లో అనుమానాలు స్థానికంగా వ్యక్త పరుస్తున్నారు.మృతి పై వివిధ కోణాల్లో అనుమానాలు వ్యక్తం కావడమే కాక వృద్ధురాలు నడవలేని స్థితిలో ఉండడం కాక ఆరోగ్య స్థితి బాగాలేదు. కానీ పెట్రోల్ వృద్ధురాలీ చేతికి ఎలా వచ్చింది..? అదే విధంగా నిప్పు దేనితో అంటించుకుంది.? అనే కోణాల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా ఆస్తి తగదమే ఇందుకు కారణం..? కావచ్చునని స్థానిక ప్రజల నుండి అనుమానాలు వినిపిస్తున్నాయి. పోలీసులు విచారణ ఏ కోణాల్లో చేశారు...? లేక కుటుంబ సభ్యులు చెప్పారని కేసు నమోదు చేశారా..? అనుమానాలకు తవిస్తుంది. వృద్ధురాలు మృతి పై దళిత సంఘాలు ,స్థానికుల నుండి అనుమానాలు వినిపిస్తున్నాయి.కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెపుతున్నారు. ఈ మృతి పై స్థానికంగా పలు కోణాల్లో అనుమానాలకు తవిచండమే కాక స్థానికంగా చర్చ దారి తీస్తుంది.

# మంథని మున్సిపల్ పరిధిలోని పోచమ్మ వాడలో శంకుస్థాపన చేసిన మంత్రి..

# ఇప్పటికీ వాటర్ ట్యాంక్ అమలుకు నోచుకోలేదు.





**మంత్రి మర్చిపోయినారా..?**

**లేక కావాలనే పట్టించుకుంటాలేరా?**

**అసహనం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు...**

మంథని ( ప్రశ్న న్యూస్)
మంథని పురపాలక సంఘం పరిధిలోని పోచమ్మ వాడకట్టులో శంకుస్థాపన చేసిన వాటర్ ట్యాంక్ విలువ సుమారుగా12 కోట్ల పదిలక్షలు మంథని పట్టణంలోని దాహార్తి తీర్చడానికి 15 బి7 బి 2024 రోజున శంకుస్థాపన అంగరంగ వైభవంగా శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్ బాబు , ఉత్తంకుమార్ రెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి సమక్షంలో శంకుస్థాపన చేశారు సంవత్సరాలు గడిచిన నిర్మాణ మోక్షం దరిదాపులో లేదు షాడో ముఖ్యమంత్రి అని చెప్పుకునే శ్రీధర్ బాబు వీటిపై దృష్టి పెట్టి అమలును మర్చిపోయారు. ఇకనుండి అయినా ప్రజల సమస్యలు పట్టించుకోని గాలికి వదిలేయకుండా వాటిపై దృష్టి పెట్టి పని అమలయ్యే విధంగా చూడాలని ప్రజలు రకరకాలుగా చర్చించుకుంటున్నారు. ఇట్టి శంకుస్థాపనలు చేసినవి మంథని నియోజక వర్గంలో ఎన్నో మిగిలి ఉన్నాయి ఇలాంటి ఊకదంపుడు శంకుస్థాపనలు చేసినట్లయితే ప్రజలలో కార్యకర్తలలో మంత్రి పట్టు కోల్పోతారు. ప్రజాస్వామ్యానికి గ్రామాలు పట్టుకొమ్మలని ప్రజలు అనుకుంటుంటే వాటి అమలు చేసే విధానమే మర్చిపోయినారు. అభివృద్ధి అంటే శ్రీధర్ బాబు, శ్రీధర్ బాబు అంటే అభివృద్ధి అని చెప్పుకునే కార్యకర్తలకు ఇదొక గుణపాఠం అని ఉపన్యాసాలకే పరిమితం అవుతుంది ఇకనుండి అయినా కాలమాన పరిస్థితులకు అనుగుణంగా చేసే పనులనే చెప్పాలి చెప్పే పనులనే చేయాలి అని ప్రజలు చర్చించుకుంటున్నారు రాబోయే స్థానిక సంస్థల్లో విజయం సాధించాలంటే కార్యకర్తలను ప్రజలను సమన్వయం చేసి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజాస్వామ్యంలో మంత్రి పట్టు నిలుపుకోవాలని ప్రజలు కోరుతున్నారు వాటర్ ట్యాంకు తెచ్చిన రాడు ఎక్కడుందో అది కట్టే కాంట్రాక్టర్కే తెలియాలి స్థానిక సంస్థల దగ్గర పడుతున్న వేళ ఆ పోచమ్మ వాడకట్టు ఏరియాలో నిలబడే కౌన్సిలర్ ప్రజలకు ఏమి సమాధానం చెప్తాడో ప్రజలు గమనించాలని . స్థానిక సంస్థల బలోపేతానికి పురుడు పోసిన వాళ్ళుగా చరిత్రలో నిలిచిపోతారు. లేకపోతే ప్రజలలో నమ్మకం కోల్పోయి అదో పాతాళానికి నెట్టి వేయబడతారు ప్రజల సమస్యలపై దృష్టి పెట్టి సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు విశ్లేషించుకుంటున్నారు మేధావులు రాజకీయ విశ్లేషకులు ప్రజా ప్రతినిధులు పార్టీ కార్యకర్తలు విజ్ఞానవంతులు టీచర్లు ఇంజనీర్లు డాక్టర్లు సామాన్య ప్రజనికం ఇలా చేస్తే మంత్రి పట్టు కోల్పోతారని ప్రజలు అనుకుంటున్నారు.

# ఘట్కేసర్ మున్సిపల్ కార్యాలయంలో లైన్స్ క్లబ్ ద్వారా కంటి పరీక్షలు

ఘట్కేసర్ (ప్రశ్న న్యూస్)మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలో మున్సిపల్ ఆవరణలో లైన్స్ క్లబ్ సారా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ కన్న పరశురాం గౌడ్, మార్కెటింగ్ కృష్ణ జీవన్ బజాజ్, జిల్లా చీఫ్ అడ్మినిస్ట్రేటర్ చందగిరి ప్రసాద్, పాల్గొన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కంటి పరీక్షలకు మున్సిపల్ ఆఫీస్ లో పర్మిషన్ ఇచ్చినందుకు మున్సిపల్ కమిషనర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, మేడిపల్లి ప్రెసిడెంట్ నాదం గౌడ్ కు, లైన్స్ క్లబ్ సభ్యులకు, ఎమ్మెస్ రెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్ వారికి ధన్యవాదాలు తెలిపారు. సుమారు 100 మంది పరీక్షలు నిర్వహించామని తెలిపారు.



PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
బుధవారం 29 అక్టోబర్2025

## నేతృత్వ పోటీలతో విద్యార్థుల ప్రతిభను వెలికితీయవచ్చు





తార్నాక(ప్రశ్న న్యూస్)తార్నాక నారాయణ పాఠశాలలో నేతృత్వ పోటీలు ఘనంగా నిర్వహించారు. తరగతులలో నేర్చుకున్న విషయాలను, ప్రాజెక్టులను, వైజ్ఞానాన్ని విద్యార్థులు చేసి చూపించారు. విద్యార్థులువారు నేర్చుకున్నటువంటి పాఠాలను అనర్గలంగా తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జి.ఎం. గోపాల్ రెడ్డి, ఎ.జి.యం. బాలపరమేశ్వ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే కొత్త కొత్త ప్రయోగాలను చేయడానికి ముందుకు రావడం చాలా గర్వకారణం అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు నేతృత్వ పోటీలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ పర్వీన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ. చదువుతో పాటు అన్ని రంగాలలో ముందుండాలనితెలిపారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, భయాన్ని అధిగమించే ధైర్యాన్ని ఇస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ–చాంప్స్ ఆర్ %డ% డి. హెడ్, మహేశ్వరి, ఈ–చాంప్స్ కో– ఆర్డినేటర్. లక్ష్మీ భవాని, ఈ–చాంప్స్ విపి సరిత,ఏఈ మహేందర్, పిఈటి నరేష్, సాఫ్ట్ స్కిల్స్ డిపార్ట్మెంట్. పూజ, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కాప్రా మండల్ నూతన తహసిల్దార్ ను కలిసిన బిజెపి నేతలు



కాప్రా (ప్రశ్న న్యూస్) కాప్రా తహసిల్దారుగా గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన బైరెడ్డి రాజేష్ ని బిజెపి చర్లపల్లి డివిజన్ నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, రైల్వే బోర్డు మెంబర్లు నాదం, లక్ష్మణ్ గౌడ్, ఉప్పల అసెంబ్లీ మీడియా సెల్ కన్వీనర్ తాళ్ల ఆనంద్ గౌడ్, బిజెపి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీసీ మోర్చా ఉపాధ్యక్షులు రేగొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాహితంలో ఆదర్శంగా నిలుస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

### కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షులు : ల్యాగల దేవయ్య

### మాన్వాడలో ఘనంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు - శుభాకాంక్షలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ బోయినిపల్లి మండల అధ్యక్షులు ల్యాగల దేవయ్య ఆధ్వర్యంలో తన స్వగ్రామం మాన్వాడలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రజల అభివృద్ధి పట్ల నిబద్ధతతో పనిచేస్తూ అన్ని వర్గాల మన్ననలు పొందుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిరకాలం ఆరోగ్యంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.సామాజిక న్యాయం,అభివృద్ధి పట్ల ఆయన చూపుతున్న కృషి రాష్ట్ర ప్రజలకు ప్రేరణగా నిలుస్తోంది" అని ల్యాగల దేవయ్య తెలిపారు.

## ఆంజనేయ స్వామికి ఆకు పూజ



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో మంగళవారం రోజు క్షేత్ర పాలకుడైన శ్రీ ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణు పుష్కరిణి ఆవరణలో గల ఆంజనేయ స్వామికి అర్చక బృందం వారు మన్య సూక్త పారాయణముతో అభిషేకం నిర్వహించారు. సింధూరంతో అలంకరించిన స్వామివారికి వివిధ రకాల సుగంధం వెదజల్లే ద్రవ్యాల పూలమాలలతో అలంకరించి నాగవల్లి దలార్చన నిర్వహించారు.ఇట్టి ఆకు పూజలో భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొనియున్నారు.

# తుపాను సహాయక చర్యలకు ప్రభుత్వం పూర్తి సన్నద్ధం

### -విద్యుత్, రహదారుల పునరుద్ధరణే తొలి ప్రాధాన్యత అన్న లోకేశ్

అమరావతి (ప్రశ్న న్యూస్) మొంథా తుపాను ఆంధ్రప్రదేశ్‌ను వణికిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యల కోసం పూర్తి స్థాయిలో సన్నద్ధమైందని ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో నష్టాన్ని నివారించేందుకు, ప్రజలను ఆదుకునేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు. తుపాను తీరం దాటిన వెంటనే యుద్ధప్రాతిపదికన పనులు చేపడతామని ఆయన తెలిపారు. "విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం మా తొలి ప్రాధాన్యత. రహదారులపై చెట్లు కూలితే వెంటనే తొలగించేందుకు జేసీబీలను, ఇతర యంత్రాంగాన్ని సిద్ధం చేశాం. నిరంతరాయంగా మంచినీటి సరఫరా జరిగేలా, అవసరమైన చోట



జనరేటర్లను కూడా అందుబాటులో ఉంచాం" అని లోకేశ్ వివరించారు. క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉన్నారని, ఆర్టీజీఎస్ ద్వారా రాత్రంతా పరిస్థితిని సమీక్షిస్తామని చెప్పారు. స్వయంగా ముఖ్యమంత్రి ప్రతి రెండు గంటలకు ఒకసారి టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. తుపాను సమయంలో ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, ముఖ్యంగా బీచ్‌ల వద్దకు వెళ్లవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న ప్రజాప్రతినిధులతో నిరంతరం మాట్లాడుతూ, సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కరిస్తున్నామని అన్నారు.

**భారీ వర్షాలు, పంట నష్టం**

మొంథా తుపాను కారణంగా గడిచిన 24 గంటల్లో విశాఖ, కోనసీమ, శ్రీకాకుళం, అనకాపల్లి, పశ్చిమగోదావరి, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. దీనివల్ల ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు 43 వేల హెక్టార్లలో పంట నీట మునిగినట్టు అధికారులు గుర్తించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పూర్తిస్థాయి నష్టంపై సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఇక, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై లోకేశ్ మాట్లాడుతూ "ఇది రాజకీయాలు మాట్లాడే సమయం కాదు, ప్రజలను కాపాడుకోవడమే మా కర్తవ్యం. వాళ్ల రాజకీయాల గురించి తర్వాత మాట్లాడతాను" అని వ్యాఖ్యానించారు.

# కరాటే శిక్షణ.. ఆత్మరక్షణ

-దాడులను ఎదుర్కొనేందుకు ఒంటిపై వస్తువులే ఆయుధాలు
-మానసిక స్థైర్యమే ప్రమాదాల నుంచి సమయస్ఫూర్తి, తెగువ చూపిస్తే రక్షణ
-యువతులలో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు కరాటేలో ఉచిత శిక్షణ
-నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్న కరాటే మాస్టర్లు
-ప్రత్యేక శిక్షకులతో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సమయంలో శిక్షణ
-సద్వినియోగం చేసుకుంటున్న చిన్నారులు, యువతులు





పాలిచ్చే తల్లి పాలించే రోజు వచ్చినా.. అన్ని రంగాల్లో మహిళలు సాధికారిత సాధిస్తున్నా.. మహిళలపై జరుగుతున్న దాడుల్లో మాత్రం ఏ మార్పు రావట్లేదు. లైంగిక, శారీరక, మానసిక వేధింపులు ఏమాత్రం తగ్గడం లేదు. పసికందు నుంచి పండు ముసలి దాకా వయోభేదం లేకుండా ప్రతి స్త్రీ ఏదో ఓ చోట నిత్యం వేధింపులకు తప్పిస్తుంది గురవుతూనే ఉంది. ఇప్పుడు దాడులకు సైతం తెగిస్తున్న దుండగుల చేతిలో బలవుతూనే ఉన్నారు ఆడపడుచులు. అయితే ఇలాంటి వేధింపుల నుంచి తప్పించుకునే శక్తి వారిలోనే ఉంది. మహిళ శారీరకంగా అబలే అయినా మానసికంగా సబలే.

మేడ్చల్ (ప్రశ్న న్యూస్)మహిళలకు కరాటే ఆత్మరక్షణ సాధనం. కరాటే ఎందుకనే మాటలు పట్టించుకోవద్దు. మారుతున్న సమాజంతో పాటు పెరుగుతున్న దాడుల నుంచి తనకు తాను కాపాడుకునే మార్గాన్ని కరాటే శిక్షణలో శిక్షణ ఇచ్చే మాస్టర్లు నేర్పిస్తారు. ఈ కరాటే శిక్షణ ద్వారా దాడి చేసే వ్యక్తిపై దాడికి గురయ్యే చిన్నారులు, యువతులు, మహిళలు తమ కాళ్లను, చేతి వేళ్లను ఉపయోగించే ఎదుటి వ్యక్తిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకోవచ్చు.

**శక్తి లేదనే ఆలోచన మనసులో బలంగా ముద్రపడటం..**

ఎదుటి వ్యక్తి దాడి చేస్తున్నాడనే విషయం తెలియగానే వి నిచ్చేష్టులవుతారు మహిళలు. దానికి కారణం మాకు ఎదురించే శక్తి లేదనే ఆలోచన మనసులో బలంగా ముద్రపడటం. అయితే పురుషులు శారీరకంగా బలవంతులైనప్పటికీ మానసికంగా మాత్రం మహిళలే బలవంతులు. క్షణాల్లో నిర్ణయం తీసుకునే సామర్థ్యం కూడా స్త్రీలతో ఎక్కువ ఉంటుందంటారు. నిపుణులు దుండగుల దాడి నుంచి తమను తాము రక్షించుకునేందుకు కరాటే నేర్చుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రమాదం నుంచి బయట పడేసే మార్గాలు..**

యువతులు, మహిళలు పనిచేసే కార్యాలయానికో, కాలేజీకి వెళ్లే సమయంలోనో దుండగులు వారిపై దాడికి తెగబడుతుంటారు. ఇలాంటి సమయంలో చాలామంది మహిళలు భయంతో కళ్ళు మూసుకుంటారు. ఇదే ప్రధాన సమస్య. ప్రత్యర్థి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తేనే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ఏదో ఓ విధంగా తప్పించుకునే ప్రయత్నం చేయాలి. అందుకు చేతిలో ఉన్న వస్తువుల్ని ఆయుధంగా వాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అగంతకుడు ముందు పిలిచినప్పుడు.. ఎదుర్కొనేందుకు ఏ ఆయుధం అక్కర్లేదు.. మీ ఒంటిపై ఉన్న వస్త్రమే మీ కరవాలం.. మీ బల్లపై ఉన్న పెన్ను... తలలో ఉన్న పిన్నులు చేతిలో కత్తులు... చేతిలో ఉన్న గొడుగు, చేతి గోర్లు, గాజులు సైతం పదునైన ఆయుధాలు. ఈ ఆయుధాల తోడుతోపాటు మీరు కరాటే శిక్షణ తీసుకుంటే మీపై, మీ తోటి స్నేహితులు, చిన్నారులు, మహిళలపై దాడులు జరగకుండా నిలువరించవచ్చు.

# ఉమా నగర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

### మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం

మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని ఉమానగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉమా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమా నగర్ లో కాలనీ లో మిషన్ భగీరథ మంచినీరు వారానికి ఒకసారి రావడం వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రతిరోజు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదేవిధంగా ఉమా



నగర్ కాలనీలో సిసి రోడ్లు గుంతల మయంగా మారడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, డ్రైనేజ్ సమస్య తీవ్రంగా ఉందని, మోరీల నుండి మురికి నీరు బయటకు వస్తుందని ఆరోపించారు. వెంటనే సిసి రోడ్డుకు మరమ్మత్తులు చేసి డ్రైనేజ్ సమస్యను పరిష్కరించాలని కోరారు. పలు ప్రాంతాలలో సీసీ రోడ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉందని, మిగతా సిసి రోడ్డు పనులను పూర్తి చేయాలని, ఉమా నగర్ కాలనీలోని పలు ప్రాంతాలలో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతున్నాయని ఈ విషయం పలు సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోతుందని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు . ఈ కార్యక్రమంలో ఉమా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ప్రదీప్ వెంకటేష్ గౌడ్ జి నరేందర్ రెడ్డి, ఎం చంద్రశేఖర్ రెడ్డి అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అక్రమాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పై చర్యలు తీసుకోండి

### యాదగిరిగుట్ట పట్టణ సిఐకి ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పార్టీ ముఖ్య నాయకులు

యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)అధికార దుర్వినియోగం చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్ర వెంకటయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కలిసి యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో పట్టణ సీఐ భాస్కర్ ను కలిసి ఫిర్యాదు చేశారు. బీర్ల ఐలయ్య పై వస్తున్న అక్రమ ఆస్తుల ఆరోపణలు దృష్టి మల్చేందుకే పార్లమెంట్ సభ్యుడు చామల. కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గత సోమవారం హరీష్ రావులపై ఫిర్యాదు చేసినట్టు ఆయన ఆరోపించారు. ఎమ్మెల్యే స్వగ్రామమైన సైదాపురం మాసాయిపేట గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 726లో సుమారు 15 ఎకరాల భూమిని రైతులను మోసం చేసి స్పెక్ట్రా వెంచర్ కు విక్రయించాలని అన్నారు. సదరు వెంచర్ను డెవలప్మెంట్ చేసి ప్లాట్లు విక్రయిస్తామని కష్టమర్లను మోసం చేసి ప్లాట్లు విక్రయించి వారిని మోసం చేశాడన్నారు వెంచర్ లో ఎలాంటి డెవలప్మెంట్ చేయకుండా ఉండటంతో కస్టమర్లకు ప్లాట్లు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఎమ్మెల్యే చేసిన మోసంతో కష్టమర్లకు ప్లాటు దొరకడం లేదని దీనిపై విచారణ చేపట్టాలని కోరారు. రాజపేట మండలంలోని చల్లూరు గ్రామంలో సర్వేనెంబర్ 322లో 600 ఎకరాలు సీలింగ్ భూమిని ఎలాంటి డాక్యుమెంట్



లేకుండా అక్రమంగా తన పేరున క్రమబద్ధీకరించుకున్నాడని పోలీసుల దృష్టికి ఆయన తీసుకెళ్లారు. ఇటీవల కాలంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం సుమారు రూ. 200 కోట్ల విలువచేసే 100 ఎకరాల భూములను అక్రమార్గంలో సంపాదించాడని తుర్కపల్లికి చెందిన సాధారణ వ్యక్తి ఏసీబీ ఆదాయ పనుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడని దీనిపై సమగ్రంగా విచారించాలన్నారు. బొమ్మలరామారం మండలంలోని రంగాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సుమారు 20 ఎకరాల భూమిని వివాదం ఉండగా సెటిల్మెంట్ చేసి తీసుకున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయని గుర్తు చేశారు. రాజపేట మండలంలోని చల్లూరు గ్రామంలో ఎలాంటి పరిపాల అనుమతులు గ్రామపంచాయతీ తీర్మానం లేకుండానే క్రషర్ నిర్మాణం చేపట్టారని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారని అన్నారు. హైదరాబాదులోని ఉప్పల్ చెరుకట్ట వద్ద ఎకరం భూమి, నాగోల్ లోని రూ. 13 కోట్ల భవనం బంజారాహిల్స్ లోని రూ. 13 కోట్ల విల్లాస్ తదితర స్థిరాస్తులు ఎలా కొనుగోలు చేశారు. సాంబార్ కొండ కింద నిర్మాణంలో ఉన్న పార్కింగ్, చెరువు ఎలిపాడు ప్రాంతంలో మట్టి కాంట్రాక్టు లో కాంట్రాక్టుకు డబ్బులు చెల్లించకుండా అక్రమాలకు పాల్పడి సుమారు 50 కోట్లు అప్పనంగా స్వాహా చేసినట్టు తమ దగ్గర ఆధారాలు ఉన్నాయని చెప్పి అన్నారు.ఈ కార్యక్రమంలో పి ఎస్ సి ఎస్ చైర్మన్ ఇమ్మడి రామ్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మిట్ట వెంకటయ్య , కసావు శ్రీనివాస్, పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి, పేరు పాయింట్ సత్యనారాయణ, కొన్యాల నరసింహారెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
బుధవారం 29 అక్టోబర్2025

# విద్యార్థినులపై లైంగిక వేధింపులకు గురిచేసిన అటెండర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

### బహుజన సంక్షేమ సంఘం నేతల డిమాండ్ - వినతి



కరీంనగర్ (ప్రశ్న న్యూస్)కరీంనగర్ జిల్లా, గంగాధర మండలం కురిక్యాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల బాత్రూంలో సీసీ కెమెరాలు అమర్చి దృశ్యాలను బంధించి,లైంగిక వేధింపులకు పాల్పడిన అటెండర్ యాకుబ్ పాషాపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన సంక్షేమ సంఘం (బిఎస్ఎస్) నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు బిఎస్ఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని, విద్యార్థినుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో బిఎస్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు తాండ్ర భూమేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటుక శ్రీనివాస్, రాష్ట్ర బీవిఎస్ నాయకులు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ వల్ల ముంపు ప్రాంతాలలో పర్యటించిన తహసిల్దార్ జనార్దన్ రాజు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)శ్రీకాళహస్తి నియోజిక వర్గ శ్యాసన సభ సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ముంపు ప్రాంతాలను గుర్తించి వర్షం కారణంగా ఇబ్బంది పడుతున్న బాదితులకు బాసటగా ఉండాలని ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తెదేపా నాయకులు నియోజక వర్గంలోని ముళ్లపూడి ఎస్టీ కాలనీ, ఈదల కాలువలో మొంథా తుఫాను ప్రభావంతో ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా మండల అధ్యక్షుడు అక్షింతల కిష్టా యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయనాయుడు, యునిట్ ఇంచార్జ బత్తయ్య, తహశీల్దారు జనార్ధన్ రాజు, డి.టి అనిల్, ఎంపీడీవో ఇరిగేషన్ ఎ.ఇ, ప్రభుత్వ అధికారులటో కలసి నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా తెదేపా నాయకులు మాట్లాడుతూ మొంథా తుఫాను కారణంగా ఈదుల కాలవులో ప్రవాహం ఎక్కవగా ఉండడంతో సెంటర్ ప్రజల ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేలా ప్రభుత్వ అధికారులను ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అప్రమత్తం చెయ్యడం జరిగిందని, ప్రజలకు తుఫాను కారణంగా ఎమైనా ఇబ్బందులు వస్తే పార్టీ నాయకులకు దృష్టికీ తీసుకు రావాలని తద్వారా అధికారులను అప్రమత్తం చేసేందుకు అవకాశం ఉంటుందని తెదేపా నాయకులు గ్రామస్తులను కోరారు.

# మోదీ- నీతీశ్ ప్రభుత్వం బిహార్ యువత ఆకాంక్షల గొంతు నొక్కేసింది : రాహుల్

మోదీ- నీతీశ్ ప్రభుత్వం బిహార్ యువత ఆకాంక్షల గొంతు నొక్కేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం ఆరోపించారు. ప్రతీ అభివృద్ధి సూచికల్లోనూ వెనక్కునెట్టి రాష్ట్రాన్ని అగాథంలోకి నెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో మార్పునకు సమయం ఆసన్నమైందన్న ఆయన, న్యాయం కోసం మహాగఠ్‌బంధన్‌ను ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఇటీవల బిహార్ యువతతో మాట్లాడిన వీడియోను జతచేస్తూ రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు."కొన్ని రోజుల క్రితం బిహార్ యువతతో విద్య, వైద్యం, ఉపాధి సహా ప్రతి అంశంపై ఆసక్తికరమైన చర్చ జరిగింది. అన్ని అంశాల్లో దయనీయమైన పరిస్థితికి బీజేపీ- జేడీయూ నేతృత్వంలోని ప్రభుత్వమే బాధ్యత వహిస్తుంది. గత 20ఏళ్లుగా మోదీ-నీతీశ్ ప్రభుత్వం తమ ఆకాంక్షలను ఎలా అణచివేసిందో, రాష్ట్రాన్ని ఎలా అగాథంలోకి నెట్టిందో బిహార్ యువతకు బాగా తెలుసు. విద్యా రంగంలో 9 నుంచి 10 తరగతుల్లో డ్రాపౌట్ రేటు పరంగా బిహార్ 29 రాష్ట్రాల్లో 27వ స్థానంలో ఉంది. 11, 12 తరగతుల్లో నమోదు రేటులో 29 రాష్ట్రాల్లో 28వ స్థానంలో ఉంది. మహిళా అక్షరాస్యతలో 29 రాష్ట్రాల్లో 28వ స్థానంలో ఉంది. ఉద్యోగ, సేవా రంగంలో ఉపాధి పరంగా బిహార్ 21వ స్థానంలో ఉంది. పరిశ్రమలు, తయారీ రంగంలో 23వ స్థానంలో ఉంది. శిశు మరణాల రేటు, భీమా పథకాల ద్వారా ఆరోగ్య కవరేజీలో బిహార్ 29 రాష్ట్రాల్లో 27వ స్థానంలో ఉంది. గృహాల్లో మరుగుదొడ్లు అందుబాటులో ఉన్న రాష్ట్రాల జాబితాలో 29వ స్థానంలో ఉంది. మానవాభివృద్ధి సూచిక (%ఎణ×%) పరంగా బిహార్ 27వ స్థానంలో ఉంది. ఇక తలసరి ఆదాయం పరంగా 25వ స్థానంలో ఉంది. ఇవి కేవలం సంఖ్యలు మాత్రమే కాదు. 'డబుల్ ఇంజిన్' సర్కార్ బిహార్‌ను పురోగతి నుంచి ఎంత వెనక్కి లాగుతుందో చూపించే అద్దం లాంటింది."నేను కలిసిన బిహారీ యువకులు అందరూ చాలా ప్రతిభావంతులు, ఇంకా తెలివైనవారు. వారి సామర్థ్యం, కృషితో ఎక్కడైనా రాణించగలరు. కానీ ప్రభుత్వం వారికి అవకాశాలకు బదులుగా నిరుద్యోగం, నిరాశను కల్పించింది.

# యాదగిరిగుట్ట పై భక్తుల సందడి







యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) ఎండోమెంట్స్ కమిషన్ ఆదేశాల మేరకు కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో వివిధ ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాల ద్వారా భక్తులలో ఆధ్యాత్మికతను, సంప్రదాయాలను ప్రోత్సహించే లక్ష్యంతో దేవాలయం ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టింది.

ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. వందలాది దీపాలతో శివాలయం, ఆలయం వెలుగుల మయం కావడంతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. అదేవిధంగా మహిళల కోసం ప్రత్యేకంగా వాయినాలు కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. మహిళలు సాంప్రదాయంగా పాల్గొని వందలాది దీపాలు వెలిగించి, పూజలు చేసి, హారతులు సమర్పించారు.కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల క్షేమం కోరారు. ఆలయ అధికారులు, సిబ్బంది కలిసి ఏర్పాట్లు సమగ్రంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దైవానుగ్రహాన్ని పొందారు.

**తిరువీధి లో పుఱప్పాట్టు సేవ..**

శ్రీ యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానం లో వార్షికంగా నిర్వహించు శ్రీ మనవాళ మహాముని తిరునక్షత్రములో భాగంగా మంగళవారం
శ్రీ స్వామి వారికి ఆళ్వారులకు తిరువీధి లో పుఱప్పాట్టు సేవ గావించారు. ప్రబంధ పాశురాలను పఠిస్తూ మాడవీధుల్లో ఊరేగించారు. ఈ ఉత్సవం లో దేవస్థాన ప్రధాన అర్చకులు, ఆలయ అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# వరి, పత్తి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి: ఇంచార్జ్ కలెక్టర్ గరిమ అగ్రవాల్



### రైస్, జిన్నింగ్ మిల్లర్లు వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం

సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) ఖరీఫ్ సీజన్ కు సంబంధించి కొనుగోలు కేంద్రాలను ట్యాగ్ చేసిన మిల్లర్లు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తీసుకోవాలని ఇంచార్జ్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం, పత్తి, మొక్కజొన్న తదితర పంట ఉత్పత్తుల కొనుగోలు ఇతర అంశాలపై జిల్లాలోని రా, బాయిల్డ్ రైస్ మిల్లర్లు, జిన్నింగ్ మిల్లర్లు వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయంలోని ఆడిటోరియంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ట్యాగ్ చేసిన మిల్లర్లు రైస్ మిల్లర్లు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దించుకొని ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కావాల్సిన హమాలీలను సిద్ధంగా ఉంచుకోవాలని, ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. బ్యాంకు గ్యారంటీ, అగ్రిమెంట్లు రెండు రోజుల్లోగా అందజేయాలని సూచించారు. 2024- 25 ఖరీఫ్, యాసంగి సీజన్ సంబంధించిన సీఎంఆర్ గడువులోగా అందించాలని ఆదేశించారు. మిల్లులోని గన్ని సంచులను ఆయా కొనుగోలు కేంద్రాలకు వెంటనే తరలించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రైస్ మిల్లర్లు ముందుకు వెళ్లాలని, వాటిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. రైస్ మిల్లర్ల ఇబ్బందులను పౌరసరఫరాల శాఖ దృష్టికి తీసుకెళ్తామని పరిష్కరించిన కృషి చేస్తామని స్పష్టం చేశారు.

**జిన్నింగ్ మిల్లులో మిల్లుల్లో వసతులు కల్పించాలి**

జిల్లాలోని ఐదు సీసీఐ కొనుగోలు కేంద్రాలైన జిన్ను మిల్లుల వద్ద పత్తి రైతులకు కనీస వసతులు కల్పించాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. ఆయా కొనుగోలు కేంద్రాల వద్ద మద్దతు ధర, కపాస్ కిసాన్ అప్లికేషన్లో స్లాట్ బుకింగ్ తదితర అంశాలు తెలిపేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తూనికలు కొలతలు శాఖ వారి ఆమోదించిన కాంటాలను వినియోగించాలని, అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులు పొందాలని ఆదేశించారు. జిల్లాలోని 29 వేల మంది రైతులు కపాస్ కిసాన్ లో వివరాలు నమోదు చేసుకున్నారని సీసీఐ అధికారులు ఇంచార్జి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు రెండు ఏర్పాటు చేశామని ఆయా ప్రాంతాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ సూచించారు.సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ శేషాద్రి, డీసీఎస్ఓ చంద్ర ప్రకాశ్, డీఏఓ అఫ్జల్ బేగం, డీసీఓ రామకృష్ణ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, మార్కెటింగ్ శాఖ అధికారి ప్రకాష్, మార్కెఫెడ్ అధికారి హబీబ్, సీసీఐ అధికారులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో కృత్రిమ వర్షం కోసం సన్నాహాలు- తొలిసారి క్లౌడ్‌సీడింగ్!

కాలుష్య భూతంతో దిల్లీ యుద్ధం చేస్తోంది. శీతాకాల ప్రభావంతో పాటు బాణాసంచా కారణంగా తీవ్రమవుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు కృత్రిమ వర్షం కురిపించేందుకు దిల్లీ ప్రభుత్వం సిద్ధమైంది. వాతావరణం అనుకూలిస్తే మంగళవారం తొలిసారి క్లౌడ్‌సీడింగ్ నిర్వహిస్తామని దిల్లీ పర్యావరణ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా తెలిపారు. ఇందుకు సంబంధించిన విమానం కాన్పూర్ నుంచి దిల్లీకి రానుందని వెల్లడించారు. దిల్లీకి క్లౌడ్ సీడింగ్ తప్పనిసరని, వాతావరణ సమస్యలను ఎదుర్కొనేందుకు ఈ ప్రయోగం ఎంతగానో ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి రేఖా గుప్తా ధీమా వ్యక్తం చేశారు. దిల్లీలో క్లౌడ్‌సీడింగ్ ప్రయోగానికి ఇప్పటికే సన్నాహాలు పూర్తయ్యాయి. దీంతో మరికొన్ని గంటల్లో వర్షం పడే అవకాశం ఉందని అంటున్నారు. గత వారం బురారి మీదుగా విమానం నుంచి సిల్వర్ అయోడైడ్, సోడియం క్లోరైడ్ సమ్మేళనాలను కురిపించారు. అయితే వాతావరణంలో తేమ శాతం కారణంగా వర్షం కురవలేదు. కాగా, మంగళవారం ఉదయం దిల్లీలో గాలి నాణ్యత సూచిక రికార్డ్ స్థాయిలో 305కు చేరుకుంది.

సుమారు 3 కోట్ల 21 లక్షల రూపాయల వ్యయంతో ఐదు క్లౌడ్ సీడింగ్ ట్రయల్స్ నిర్వహించడానికి %××ు% కాన్పూర్‌తో దిల్లీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు డైరెక్టరేడ్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కూడా %××ు% కాన్పూర్‌కు అనుమతి మంజూరు చేసింది. అయితే, ఐఐటీ కాన్పూర్ ప్రకారం కృత్రిమ వర్షం కురిపించడానికి 11 ప్రభుత్వ విభాగాల అనుమతులను పొందాల్సి ఉంటుంది. ఈ జాబితాలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్, రక్షణ శాఖ, హోం శాఖ, స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్‌పీజీ), పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల శాఖ, దిల్లీ ప్రభుత్వం, భారత విమానాశ్రయ అథారిటీ, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, భారత వాతావరణ శాఖ, కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు, భారత పురావస్తు సర్వే విభాగం, విమానయాన శాఖ - పౌర భద్రతా బ్యూరోలు ఉన్నాయి.

క్లౌడ్ సీడింగ్ అనే విధానం ద్వారా కృత్రిమ వర్షాన్ని కురిపిస్తారు. ఇందులో భాగంగా సిల్వర్ అయోడైడ్, పొటాషియం అయోడైడ్, డ్రై ఐస్ వంటి రసాయనాల మిశ్రమాన్ని విమానాలు, హెలికాప్టర్ల నుంచి మేఘాల్లోకి చల్లుతారు. అమెరికాకు చెందిన 'సెస్నా' రకం విమానాలను ఇందుకోసం వినియోగిస్తారు. ఈ విమానాలు మేఘాలపై నిర్ణీత ఎత్తులోకి వెళ్లి, అక్కడి నుంచి మేఘాలపైకి రసాయనాల మిశ్రమాన్ని చల్లుతాయి. ఈ రసాయనాలు మేఘాల్లోని నీటి ఆవిరిని, తేమను తమవైపుగా ఆకర్షిస్తాయి. తర్వాత ఆ నీటి ఆవిరి, తేమ కలిసిపోయి ఘనీభవించిన బిందువులు ఏర్పడుతాయి. ఇవే చివరికి వర్షంగా కురుస్తాయి. ఈ పద్ధతిలో వర్షాన్ని కురిపించడానికి దాదాపు 30 నిమిషాల సమయం పడుతుంది. క్లౌడ్ సీడింగ్‌లో 2 రకాలు ఉన్నాయి. అవి హైగ్రోస్కోపిక్ క్లౌడ్ సీడింగ్, గ్లేసియోజెనిక్ క్లౌడ్ సీడింగ్.భారతదేశంలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా క్లౌడ్ సీడింగ్‌ను నిర్వహించలేదు. ఐఐటీ కాన్పూర్ 2024లో దీనిపై ఒక ప్రయోగాన్ని నిర్వహించాలని భావించినా తర్వాత దాన్ని వాయిదా వేసింది. కానీ 2023 డిసెంబరులో పాకిస్థాన్‌లోని లాహోర్‌లో క్లౌడ్ సీడింగ్ నిర్వహించారు. దీనివల్ల అక్కడ గాలి నాణ్యత 300 నుంచి 189కి తగ్గినా, ఆ తర్వాత రెండు రోజుల్లోనే ఆ నగరంలో మళ్లీ గాలి నాణ్యత క్షీణించింది

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
బుధవారం 29 అక్టోబర్2025

## మద్యం మత్తులో భార్యపై దాడి -భర్త రిమాండ్

### కరీంనగర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ : ఏ. నిరంజన్ రెడ్డి



కరీంనగర్ (ప్రశ్న న్యూస్)గత కొంతకాలంగా మద్యం మత్తులో భార్యను హింసిస్తున్న భర్తను కరీంనగర్ రూరల్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం ఆరేపల్లి గ్రామానికి చెందిన సత్తినేని కరుణాకర్ ప్రతిరోజూ మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యపై దౌర్జన్యానికి పాల్పడేవాడని,సెప్టెంబర్ 15న కూడా మద్యం మత్తులో ఇంటికి చేరి భార్యతో వాగ్వాదం జరిగి,కోపంతో కట్టెతో చేతులు,శరీరంపై దాడి చేశాడు.గాయాలతో బాధితురాలు నేలపై పడిపోవడంతో స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని,అనంతరం ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.అప్పటి నుంచి పరారీలో ఉన్న కరుణాకర్‌ను మంగళవారం పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి తెలిపారు.

## అమరవీరుల త్యాగాలకు నివాళిగా మెగా రక్తదాన శిబిరం

### రక్తదానం ప్రాణదానంతో సమానం

### జిల్లా ఎస్పీ : మహేష్ బి. గీతే






సిరిసిల్ల / వేములవాడ (ప్రశ్న న్యూస్)పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని కళ్యాణ లక్ష్మీ గార్డెన్స్‌లో మెగా రక్తదాన శిబిరం మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే ముఖ్య అతిథిగా హాజరై, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి స్వయంగా రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గీతే మాట్లాడుతూ,

"రక్తదానం ప్రాణదానంతో సమానం. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి జీవితాలను కాపాడడంలో రక్తదానం కీలక పాత్ర పోషిస్తుంది," అన్నారు. అమరవీరుల జ్ఞాపకార్థం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది, యువత, ఆటో డ్రైవర్లు, స్వచ్ఛంద సేవకులు ఇలా సుమారు 460 మంది ఈ రక్తదాన శిబిరంలో పాల్గొనడం అభినందనీయమని తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరవదని, వారి సేవలను స్మరించుకునేందుకు ప్రతి సంవత్సరం పోలీస్ "ఫ్లాగ్ డే" ను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.అలాగే, రక్తదానం పై ఉన్న అపోహలను పక్కనపెట్టి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. "మనం ఇచ్చే రక్తం ప్రమాద సమయంలో లేదా తలసేమియా వంటి వ్యాధులతో బాధపడుతున్నవారికి ప్రాణాధారంగా ఉంటుంది," అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సీఐలు కృష్ణ,మొగిలి, శ్రీనివాస్,వీరప్రసాద్, వేంకటేశ్వర్లు,నాగేశ్వరరావు, మధుకర్,నటేష్,ఆర్ఐలు మధుకర్,రమేష్,యాదగిరి, ఎస్ఐలు, డాక్టర్ సంధ్యారాణి, కరీంనగర్%–%సిరిసిల్ల%–%నిజామాబాద్ జిల్లాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, గుడ్ల రవి,పెండ్యాల కేశవరెడ్డి,బుస్స ఆంజనేయులు, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## కురిక్యాల ఘటనపై నేడు మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ పర్యటన


### బీజేపీ గంగాధర మండలాధ్యక్షులు : పంజాల ప్రశాంత్ గౌడ్



గంగాధర (ప్రశ్న న్యూస్)చొప్పదండి నియోజకవర్గం,గంగాధర మండలంలోనికురిక్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనతో విద్యార్థుల్లో నెలకొన్న భయాందోళనల నేపథ్యంలో, వారికి ధైర్యం కల్పించేందుకు మాజీ చొప్పదండి ఎమ్మెల్యే బొడిగె శోభ నేడు బుధవారం ఉదయం 9.30 గంటలకు పాఠశాలను సందర్శించనున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులతో,వారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ భరోసా ఇవ్వనున్నారని బీజేపీ గంగాధర మండల అధ్యక్షులు పంజాల ప్రశాంత్ గౌడ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు అందరూ అధికసంఖ్యలో కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

## బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలు దానం

### చందానగర్ పరిధిలో విషాదం



చందానగర్(ప్రశ్న న్యూస్)చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి బ్రెయిన్ డెడ్ కావడంతో, ఆయన కుటుంబ సభ్యులు మానవతా దృక్పథంతో అవయవాలు దానం చేయడం మనసును కదిలించింది.

సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ జేపీ నగర్‌కు చెందిన సామల పాపిరెడ్డి (బీహెచ్ఈఎల్ కంపెనీ కాంట్రాక్టు ఉద్యోగి) ఈ నెల 25న శనివారం హొండా యాక్టీవ్ పై సాధన స్కూల్ మీదుగా కంపెనీకి వెళ్తుండగా, నల్లగండ్ల వైపు నుంచి వచ్చిన బైక్ వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పాపిరెడ్డి తీవ్రంగా గాయపడి, తలకు బలమైన దెబ్బలతో పాటు చేతికి, కాలికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే సిటిజెన్ హాస్పిటల్‌కు తరలించగా, రెండు రోజుల పాటు చికిత్స పొందిన ఆయన సోమవారం రాత్రి బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు ప్రకటించారు.సమాచారం అందుకున్న చందానగర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆంజనేయులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**మానవతా హృదయం చూపిన కుటుంబం**

రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయిన పాపిరెడ్డి అవయవాలను ఇతరులకు దానం చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయం తీసుకోవడంతో వైద్యులకు తెలియజేశారు. వారి మానవతా నిర్ణయంతో అనేక మంది ప్రాణాలు కాపాడబడినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంలో తెల్లాపూర్ గ్రామ ప్రజలు, వైద్యులు కుటుంబ సభ్యుల త్యాగాన్ని ప్రశంసించారు.

## ఎస్ ఎస్ సి బోర్డు పరీక్షల వల్ల విద్యార్థులకు ఇబ్బందులు..

**-దూరంగా ఎస్ ఎస్ సి బోర్డు పరీక్ష సెంటర్లు...**
**-దీంతో విద్యార్థులకు తప్పని తిప్పలు...**
**-ప్రభుత్వ స్కూళ్లను తనిఖీ చేయని డిఈఓ,ఎంఈఓ లు...**
**-ఎంఈఓ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థి, సంఘాలు .**
**-ఫీజు ముగింపు కాకముందే డిఇఓ అనుమతి లేకుండానే పరీక్ష సెంటర్లను అలాట్మెంట్ చేస్తున్న ఓ అధికారి.**




మంథని ( ప్రశ్న న్యూస్)మంథని మండలంలో విద్య వ్యవస్థ గడి తప్పినట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు కారణం పెద్దపల్లి డిఈఓ మంథని ఎంఈఓ లు ప్రభుత్వ ,ప్రవేట్ స్కూళ్ల లో విద్యార్థులకు అందుతున్న నాణ్యమైన విద్య,సదుపాయాల గురించి... తనిఖీలు చేయటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి విద్య వ్యవస్థ పై ప్రత్యేక దృష్టి పెట్టీ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య సరైన సదుపాయలు కల్పించాలని మంచి ఉన్నత మైన లక్ష్యంతో నిధులు వేచించి ఎప్పటికప్పుడు విద్య వ్యవస్థ పై మీటింగ్ లు కూడా నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ పెద్దపల్లి జిల్లాలో మాత్రం విద్య వ్యవస్థ ను మాత్రం కొందరు నిర్వీర్యం చేస్తున్నారనీ బహిరంగంగా విమర్శలు వినిపిస్తున్నాయి.అదే కాక మంథనిలో మాత్రం విద్య వ్యవస్థ గాడి తప్పింది. అందుకు కారణం అధికారులు ప్రభుత్వ స్కూళ్లను తనిఖీ చేయకపోవటం కారణమనీ స్థానికంగా ఆరోపణలు వస్తున్నాయి.విద్యార్థులు ఎలా చదువుతున్నారు. సదుపాయాలు ఎలా ఉన్నాయనీ అడిగి తెలుసుకోవాలి. ప్రభుత్వ ఆదేశాలను డిఈఓ, ఏంఈఓ లు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తు... ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోవటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మంథనిలో ఎస్ ఎస్ సి బోర్డు పరీక్షలకు దూరంగా ఎస్ ఎస్ సి బోర్డు పరీక్ష సెంటర్లను ఏర్పాటు చేయడం వల్ల అరెందా,వెంకటాపూర్ , సోమనపల్లి, ఎక్లాక్లాస్ పూర్, గుంజపడుగు , గర్ల్స్ హైస్కూల్, గౌట్ హై స్కూల్ ఎస్ఎస్సి విద్యార్థులకు పరీక్ష సెంటర్లను దూరంగా ఏర్పాటు చేశారు.దీంతో విద్యార్థులకు దూర భారం పడుతుంది. ఏప్పటిలాగా గౌట్ హైస్కూల్, గర్ల్స్ హై స్కూల్ లకు సెంటర్లను కేటాయించకుండా గురుకుల పాఠశాల, జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ లకు సెంటర్లను కేటాయించారు.దీంతో విద్యార్థులకు దూరం ఎక్కువ కానుంది.విద్యార్థులకు ఆటో ఛార్జీలు 50 నుంచి 100 రూపాయల ఛార్జీలు పెట్టుకొని బోర్డు పరీక్షలకు వెళ్ళే పరిస్థితి ఎంఈఓ, డిఈఓ లతో ఏర్పడిందని వీటిపై కలెక్టర్ దృష్టి పెట్టి పరీక్ష సెంటర్లను పదవ తరగతి విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదనతో కోరుతున్నారు. దీంతో విద్యార్థులకు మాత్రం తిప్పలు తప్పవు.ఎంఈఓ, డిఈఒ లు ఏం చేస్తున్నారని.... విద్యార్థి సంఘాలు, తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.కొన్నేళ్లుగా ఒకే చోట మంథని,పెద్దపల్లిలో విధులు నిర్వహిస్తున్న అధికారులను బదిలీ చేయకపోవడం వల్లనే తనిఖీలు చేయకుండా నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారని మండలంలో స్థానికంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## నేషనల్ హైవే అండర్ బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి:



ఘట్కేసర్(ప్రశ్న న్యూస్)మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం అఖిలపక్ష నాయకులు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ఆయన నివాసంలో కలిసి ఘట్కేసర్ నేషనల్ హైవే మైసమ్మ గుట్ట దగ్గర అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం అనుమతించిన పనులు జరగడం లేదని ఈటెల రాజేందర్ ని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎంపి ఈటెల రాజేందర్ ఇట్టి విషయాన్ని నేషనల్ హైవే అథారిటీ అధికారులకు ఫోన్ చేసి అడగడం జరిగింది. అధికారులు చెప్పిన మాట ఏమిటంటే మైసమ్మ గుట్ట దగ్గర అండర్ బ్రిడ్జ్ సాంక్షన్ అనే విషయం నిజమేనని. కొంతమంది ఘట్కేసర్ నాయకులు మైసమ్మ గుట్ట దగ్గర అండర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు చేపట్టవద్దని వినతిపత్రం ఇవ్వడం జరిగిందని వారు ఎంపీ దృష్టికి తేవడం జరిగింది. వెంటనే ఎంపి ఈటెల రాజేందర్ స్పందించి ఎట్టి పరిస్థితిలో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరగాల్సిందేనని అధికారులను ఆదేశించడం జరిగింది. అక్కడికి వెళ్లిన అఖిలపక్ష నాయకులు. బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ గౌడ్ . బిజెపి పార్టీ మున్సిపల్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి, టిడిపి మున్సిపాల్టీ అధ్యక్షులు వేముల సంజీవ గౌడ్ మాట్లాడుతూ కొంతమంది స్వార్థపరులు ఘట్కేసర్ మున్సిపాలిటీ అభివృద్ధి నీ అడ్డుకుంటున్నారని వారి స్వార్ధ ప్రయోజనాలకు అధికారాన్ని వాడుకుంటున్నారని. మైసమ్మ తల్లి ఘట్కేసర్ ప్రజలకు ఆరాధ్య దేవత అటువంటి ఆరాధ్య దేవతకి పోయే దారిని అడ్డుపడడం ఎంతవరకు సమంజసం మైసమ్మ గుట్ట ప్రాంతవాసులు ఎంతమంది రోడ్డు ప్రమాదంలో చనిపోయారో వారికి తెలియదా వారికి కళ్ళు ఉన్నాయా లేవా మైసమ్మ గుట్ట జాతర కు వచ్చే భక్తులకు మరియు మైసమ్మ గుట్ట పాంత లో నివసిస్తున్న ప్రజల ఆవేదన బాధలు వారికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఎవరైతే మైసమ్మ గుట్ట దగ్గర అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరగకుండా అధికారులకు వినతిపత్రం ఇచ్చి అడ్డుకుంటున్న వారి భరతం పడతామని. త్వరలో ప్రజల ముందు వారి పేర్లను పెడతామని అట్టి నాయకులను ప్రజలే శిక్షిస్తారని ఇకనైనా కుళ్ళు కుతంత్రాలు మాని మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని లేకపోతే ప్రజలే మీకు తగిన సమయంలో బుద్ధి చెప్తారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బండారి ఆంజనేయులు గౌడ్ . మైసమ్మ గుట్ట ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణధానంతో సమానం: ఎస్పీ మహేష్ బి. గీతే

### అమరవీరుల త్యాగాలకు నివాళిగా

### మెగా రక్తదాన శిబిరం



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) అమరవీరుల వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణ పరిధిలోని కల్యాణ లక్ష్మీ గార్డెన్స్‌లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు. ఈకార్యక్రమానికి ఎస్పీ మహేష్ బి. గితే ముఖ్య అతిథిగా హాజరై,రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి స్వయంగా రక్తదానం చేసి, రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాలను అందజేసి అభినందించారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రక్తదానం ప్రాణధానంతో సమానమని ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి జీవితాలను కాపాడడంలో రక్తదానం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అమరవీరుల వారోత్సవాల సందర్భంగా స్వచ్ఛందంగా యువత ,ప్రజలు,ఆటో డ్రైవర్లు,పోలీస్ అధికారులు, సిబ్బంది సుమారు 460 మంది రక్తదాన శిబిరంలో పాల్గొనడం అభినందించదగ్గ విషయమని,విధి నిర్వర్తనలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరువదని, వారి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహించడం జరుగుతుందన్నారు.

పోలీసులు కేవలం శాంతి భద్రతలను పరిరక్షించడమే కాకుండా సేవా కార్యక్రమాల్లోను ముందు వరసలో వుంటారని, ముఖ్యంగా రక్తదానంపై వున్న ఆపోహలను నమ్మకుండా ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు.మనం చేసే రక్తదానం వలన అత్యవసర సమయంలో, ప్రమాద సమయంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి, తల సేమియా వ్యాధిగ్రస్తులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సి.ఐ లు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, మధుకర్, నటేష్,ఆర్.ఐ లు మధుకర్, రమేష్, యాదగిరి, ఎస్.ఐ లు, డాక్టర్ సంధ్యారాణి,కరీంనగర్, సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లాకు చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు గుడ్లరవి, పెండ్యాల కేశవరెడ్డి, బుస్స ఆంజనేయులు, కరీంనగర్,సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## అంటువ్యాధులపై ప్రజల అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్ బాలు




శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)శ్రీకాళహస్తిలో మొంత తుఫాను వల్ల పట్టణంలోని ప్రజలు అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని శ్రీరామ నగర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలు తెలిపారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారంగా కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా కలుషితమైన నీరు కలుస్తమైన ఆహారం తీసుకోవడం వల్ల ప్రజలకు డయేరియా టైఫాయిడ్ మలేరియా వంటి రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ప్రజలకు ఆయన పలు సూచనలు చేశారు.

వేడి చేసిన నీరు తాగాలని, బయట తినుబండారాలు తినకూడదని ఈ సందర్భంగా తెలిపారు. ఇళ్ల చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకూడదన్నారు. అలా నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది డెంగ్యూ మలేరియా వంటి రోగాల బారిన పడతారని తెలియజేశారు. పది నుంచి 15 రోజుల్లో లోపల డెలివరీ అయ్యే గర్భవతులను శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి ముందస్తుగా తరలించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
బుధవారం 29 అక్టోబర్2025

## ప్రజా వ్యతిరేక పాలకులు ఈసారి ఇంటికే

### -డీఎంకే ప్రభుత్వంపై విజయ్ తీవ్ర విమర్శలు



చెన్నై (ప్రశ్న న్యూస్) నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కావేరి డెల్టా ప్రాంతంలో ధాన్యం కొనుగోళ్లు, వరద నష్టాల విషయంలో ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ సర్కార్ పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. రైతుల జీవితాల పట్ల ఉదాసీనత చూపుతూ వారిని మోసం చేస్తోందని మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తీవ్రంగా ధ్వజమెత్తారు. డెల్టా ప్రాంతాన్ని ముంచెత్తుతున్న ఎడతెరిపిలేని వర్షాలు వరి పంటలను నాశనం చేయడమే కాకుండా, డీఎంకే ప్రభుత్వ అసమర్థతను, నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేశాయని విజయ్ అన్నారు. "నీటికి నాని మొలకెత్తిన ధాన్యం గింజల్లాగే, డీఎంకే ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజల్లో నిరసన కూడా మొలకెత్తి, పెరిగి, ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తుంది" అని ఆయన హెచ్చరించారు. కురుస్తున్న వర్షాల నుంచి మిగిలిన ధాన్యం నిల్వలను కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు తక్షణ చర్యలు తీసుకోలేకపోయిందని విజయ్ ప్రశ్నించారు. "రైతులపై నిజంగా శ్రద్ధ ఉన్న ప్రభుత్వం వారి జీవనోపాధిని కాపాడటానికి, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి సహాయపడుతుంది. కానీ ఈ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తూ, రైతులు కష్టపడి పండించిన పంట వర్షానికి కుళ్లిపోయేలా చేసి పేద రైతులను అణిచివేస్తోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న పేద రైతులకు సకాలంలో కొనుగోళ్లు, గిట్టుబాటు ధర లభించే వ్యవస్థ ఉండాలని విజయ్ నొక్కి చెప్పారు. "ప్రతి ఏటా ఇదే దయనీయ పరిస్థితి పునరావృతమవుతోంది. రైతులు తమ పంటను అమ్ముకొని సంపాదించుకోకుండా స్టాలిన్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటుందా?" అని ఆయన నిలదీశారు. డెల్టా ప్రాంత ప్రయోజనాలకు తామే కాపలాదారులమని డీఎంకే చెప్పుకోవడాన్ని విజయ్ ఎద్దేవా చేశారు. "స్టాలిన్ తాను డెల్టా బిడ్డనని గొప్పలు చెప్పుకుంటారు, కానీ ఏటా రైతుల పంటలు వర్షాలకు నాశనమవుతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటోంది. ఇలాంటి నష్టాలను నివారించడానికి ముందస్తు చర్యలు ఉండక్కర్లేదా? పండించిన ధాన్యాన్ని కాపాడటానికి నిల్వ సౌకర్యాలు మెరుగుపరచవద్దా?" అని ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు. నిల్వ ఉంచిన బస్తాల్లోనే ధాన్యం మొలకెత్తినట్లే, డీఎంకేపై ప్రజా వ్యతిరేకత కూడా ప్రజల మనసుల్లో మొలకెత్తడం ప్రారంభమైందని, ఈ అసంతృప్తి త్వరలోనే బలపడి ప్రజా వ్యతిరేక పాలకులను ఇంటికి పంపిస్తుందని విజయ్ అన్నారు. రైతు వ్యతిరేక కార్యకలాపాలను తక్షణమే నిలిపివేసి, ఈశాన్య రుతుపవనాల నేపథ్యంలో పంటలను, ప్రజలను కాపాడటానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మంత్రులకు రేవంత్ బిగ్ టాస్క్

### -డివిజన్ల వారీగా బాధ్యతలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)ముఖ్యమంత్రి రేవంత్ కీలక నిర్ణయం తీసుకున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపు ఇప్పుడు కాంగ్రెస్ కు ప్రతిష్ఠాత్మకంగా మారింది. సీటు నిలబెట్టుకొనేందుకు బీఆర్ఎస్ కొత్త వ్యూహాలను అమలు చేస్తోంది. అటు బీజేపీ నేతలు నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్నారు. ఈ ఎన్నిక వేళ సర్వే నివేదికలతో రేవంత్ తానే ప్రచారంలోకి దిగాలని డిసైడ్ అయ్యారు. కాగా మంత్రులకు కీలక బాధ్యతలు అప్పగించారు. బిగ్ టాస్క్ ఫిక్స్ చేసారు. ఈ నిర్ణయం ఇప్పుడు సంచలనంగా మారింది.

జూబ్లీహిల్స్ లో ఇప్పుడు పోరు హోరా హోరీగా మారుతోంది. మూడు ప్రధాన పార్టీలు గెలుపు పైన ఫోకస్ చేసాయి. ఎప్పటికప్పుడు గ్రౌండ్ రిపోర్ట్స్ తెప్పించుకుంటూ అవసరమైన మార్పులను చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాయి. తాజాగా సీఎం రేవంత్. కాంగ్రెస్ పార్టీ నేతలతో జూబ్లీహిల్స్ బై పోల్ పైన కీలక భేటీ నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి పొరపాటు లేకుండా ప్రతీ డివిజన్ ప్రతీ ఇంటికి వెళ్లి ప్రచారం చేసే విధంగా మంత్రులను రంగంలోకి దించారు. ఈ మేరకు డివిజన్ల వారీగా మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. ఒక్కో డివిజన్ కు ఇద్దరు మంత్రులను బాధ్యులను చేసారు. అందులో భాగంగా యూసఫ్ గూడా కు ఉత్తమ్, పొన్నంకు బాధ్యతలు కేటాయించారు.

షేక్ పేట- వివేక, కొండా సురేఖ.. రహ్మత్ నగర్ - కోమటిరెడ్డి, పొంగులేటి.. సోమాజీగూడ- శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, ఎర్రగడ్డ- దామోదర్ రాజనర్సింహ, జూపల్లి.. వెంగళరావు నగర్ - తుమ్మల, వాకిటి శ్రీహరి.. బోరబండ - సీతక్క, ఎంపీ మల్లురవిని బరిలోకి దించారు. అదే విధంగా పలు కార్పోరేషన్ల ఛైర్మన్లు ప్రచారం నిర్వహిస్తున్నారు. రేవంత్ సైతం రోడ్ షోల్లో పాల్గొననున్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలన తరువాత గ్రేటర్ పరిధిలో జరుగుతున్న ఎన్నిక కావటంతో గెలిచి తమ బలం నిరూపించుకోవాలని రేవంత్ భావిస్తున్నారు. అదే విధంగా మంత్రులకు తమకు కేటాయింపు చేసిన డివిజన్లలో మెజార్టీ బాధ్యతలు అప్పగించటంతో వారిలో టెన్షన్ పెరుగుతోంది. మంత్రులకు అప్పగించిన టాస్క్ ఆధారంగా వారిపైన భవిష్యత్ నిర్ణయాలు ఉండే అవకాశం ఉందని పార్టీ నేతల సమాచారం. జూబ్లీహిల్స్ తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు, గ్రేటర్ ఎన్నికలు ఉండటంతో ఇప్పుడు రేవంత్ టీం ఇక్కడ ఎలాంటి ఫలితం సాధిస్తుందనేది ఉత్కంఠగా మారుతోంది.

# కట్టు బొట్టు మార్చిన కవిత

### -ఆ లేడీ పొలిటీషియన్‌ను గుర్తుకు తెచ్చేలా



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవిత బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత తన రాజకీయ పయనాన్ని కొత్త కోణంలో ప్రారంభించారు. ఆమె ప్రస్తుత కట్టు, బొట్టు శైలి ప్రజా సమక్షంలో ఆమె ఆహార్యం చూస్తుంటే తమిళనాడు రాజకీయ చరిత్రలో అమ్మగా గుర్తింపు పొందిన దివంగత ముఖ్యమంత్రి జయలలితను తలపిస్తుందన్న చర్చ తెలంగాణ రాజకీయాల్లో నడుస్తోంది. ఈ మార్పు కేవలం సౌందర్యానికే పరిమితమా లేక జయలలిత తరహాలో బలమైన మహిళా నాయకురాలిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సాధించుకునేందుకు వేసిన వ్యూహాత్మక అడుగా అన్నది ప్రస్తుతం రాజకీయ విశ్లేషకుల మధ్య ప్రధాన ప్రశ్నగా మారింది.

**జయలలిత స్ఫూర్తితో కొత్త ఇమేజ్.?**

రాజకీయాలలో దృష్టిపరమైన గుర్తింపు ఎంత ముఖ్యమో జయలలిత నిరూపించారు. ఆమె ప్రత్యేకమైన వస్త్రధారణ, బాడీ లాంగ్వేజ్ ధైర్యంగా మాట్లాడే ధోరణి ఆమెను ఐకాన్‌గా మార్చాయి. తాజాగా 'జాగృతి జనం బాట యాత్ర'లో కవిత కట్టుబొట్టు, పబ్లిక్ ఇంటరాక్షన్ స్టైల్‌ను గమనించినవారు, ఆమె జయలలిత ఆహార్యాన్ని రీక్రియేట్ చేస్తున్నారని భావిస్తున్నారు. ఈ విజువల్ పాలిటిక్స్ ద్వారా ఆమె ప్రేక్షకుల మనసుల్లో బలమైన నాయకురాలిగా నిలిచిపోవాలనే ప్రయత్నం చేస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా మహిళా ఓటు బ్యాంకులో బలమైన సెంటిమెంట్‌ను క్రియేట్ చేయాలనే ఉద్దేశంతోనే కవిత ఈ నాయకత్వ శైలిని ఎంచుకున్నారని చర్చ జరుగుతోంది. ఇది మహిళా సాధికారతకు ప్రతీకగా సాఫ్ట్ లీడర్ ఇమేజ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. కవిత వేస్తున్న ప్రతి అడుగు జనం బాటలో నేరుగా ప్రజలను కలవడం, సాఫ్ట్ స్పీచ్‌తో పాటు విమర్శలు చేయడం ఇవన్నీ కూడా 'తాను తిరిగి వచ్చాను, రాజకీయ ఆట ఇంకా ముగియలేదు' అనే స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి. కవిత తన రాజకీయ ప్రయాణంలో ఇమేజ్ గేమ్‌కే పరిమితం కాకుండా బలమైన సామాజిక అజెండాను ఎంచుకున్నారు. ఆమె ప్రధానంగా బీసీల అజెండాను భుజాన వేసుకుంటున్నట్టు కనిపిస్తోంది. రాష్ట్రంలో బీసీల రాజ్యాధికారంపై ఉన్న బలమైన డిమాండ్‌ను ఉపయోగించుకోవాలని చూస్తున్నారు. తన తండ్రి కేసీఆర్‌తో రాజకీయ విభేదాలు వచ్చినా అవినీతి ఆరోపణలు ఎదురైనా, తెలంగాణ అస్తిత్వాన్ని, బీసీ వాదాన్ని ప్రచారం చేయడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని పొందాలని ప్రయత్నిస్తున్నారు. కవిత గతంలో మహిళా రిజర్వేషన్ల కోసం కృషి చేశారు. ఇప్పుడు ఈ అంశాన్ని మళ్లీ తెరపైకి తీసుకువచ్చి బీసీ వాదంతో కలిపి సమపాలనలో ముందుకు తీసుకువెళితే మహిళా లోకాన్ని రాజకీయంగా చైతన్యం చేయగలుగుతారని భావిస్తున్నారు. ఏ ఇతర పార్టీలో చేరినా తగిన ప్రాధాన్యత లభించకపోవచ్చు అలాగే తండ్రిని విమర్శించాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. కాబట్టి సొంత పార్టీని ఏర్పాటు చేయడం ద్వారా తను అనుకున్న రాజకీయ మార్గంలో వెళ్లడానికి రాజకీయ ఉనికిని చాటుకోవడానికి ఇది సరైన మార్గం అని కవిత విశ్వసిస్తున్నట్టు కనిపిస్తోంది.

అయితే జయలలితకు ఉన్న మాస్ ఇమేజ్ రావాలంటే కేవలం కట్టుబొట్టు సరిపోదు, నేరుగా గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి ప్రజల కష్ట సుఖాలను పంచుకొని, వారికి కొత్త పరిష్కారాలను చూపించగలిగితేనే మాస్ లీడర్‌గా స్థిరపడగలుగుతారని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా ఆమె జయలలితను గుర్తు చేసే విధంగా అప్పియరెన్స్ ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## పుస్తకాలు చదవండి జ్ఞానం పెంచుకోండి:

### ఎసిపి శ్రీనివాస్ నాయుడు





యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)పుస్తక పఠనం తో విజ్ఞానాన్ని పెంచుకోవచ్చు. నవ చేతన సంచార పుస్తకాలయం ప్రారంభంలో ఏసీపీ శ్రీనివాస్ నాయుడు తెలిపారు. పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించు కొనేందుకు ఉపయోగపడుతుందని యాదగిరిగుట్ట అసిస్టెంట్ కమిషనర్ పోలీస్ (ఏ సి పి )శ్రీనివాస్ నాయుడు పేర్కొన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట లో నవ చేతన సంచార పుస్తకాలయంను ఆయన ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక, సామాజిక, శాస్త్రీయ అంశాలు పిల్లలకు ,కుటుంబానికి సంబంధించిన అనేక పుస్తకాలు సమాజంలోకి తీసుకురావడంలో భాగంగా నవ చేతన విజ్ఞాన కేంద్రం చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. సంచార పుస్తకాలయం ను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు అనేక పుస్తకాలు ముఖ్యంగా ఉద్యోగాలకు సంబంధించిన కాంపిటేటివ్ పుస్తకాలు కూడా ఇందులో అందుబాటులో ఉంచారన్నారు ఇలాంటి పుస్తకాలను ప్రజలందరూ కుటుంబ సమేతంగా సందర్శించి మంచి మంచి పుస్తకాలను కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ భాస్కర్ సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గోద శ్రీరాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి జంగమ్మ, కళ్లెం కృష్ణ, పేరబోయిన మహేందర్ సిపిఐ మున్సిపల్ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్,నాయకులు పేరబోయిన పెంటయ్య, పేరబోయిన బంగారి మాటూరి మల్లయ్య,అరె పుష్ప, గోపగాని రాజు, కోకల రవి, మునుకుంట్ల నరసమ్మ, గుండు వెంకటేష్ అనంతుల నరసింహ వెంకటేష్ రాములు సత్తిబాబు చందు నాయక్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# రోడ్డు విస్తరణ త్వరగా పూర్తి చేయండి: మంత్రి వినోద్ కుమార్

**-జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యంతో చాలా ఆలస్యంగా జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు**

**-ఇంకా ఎన్ని సంవత్సరాలు కావాలి.? బాధ్యత వహించని అధికారులు**

**-రేపు రేపు అంటూ సంవత్సరాలు కాలం గడిచిపోయి దశాబ్దంలోకి వచ్చేసాం**

**-రోడ్డుపైన సంతతో ట్రాఫిక్ కు ప్రత్యక్ష నరకం ఏర్పడుతుంది**

**-మంగళవారం సంతలో దుకాణాలను రోడ్డుపై రాకుండా లోపలికి పెట్టే విధంగా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలి**

**-రోడ్డు విస్తరణను అధికారులు ఇప్పటికైన త్వరగా చేసి సమస్య తీర్చాలని కోరుకుందాం**





తార్నాక (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ నియోజకవర్గంలోని తార్నాక డివిజన్లోలాలాపేట్ రహదారి విస్తరణకు నోచుకోక వాహనా దారులు చాలామంది ఇబ్బందులకు గురవుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మంత్రి వినోద్ కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో పెట్రోల్ బంక్ ముందు చిన్నపాటి వర్షం వచ్చిన నీరు పోక వాహనా దారులకు పాదాచారులకు ట్రాఫిక్ జామ్ ఇక్కట్లు ఏర్పడుతున్నాయని రోడ్డు విస్తరణ కోసం సంవత్సరాలు గడిచి దశాబ్దంలోకి వచ్చిన అధికారులు కావాలని నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ గవర్నమెంట్ ఉన్నప్పుడు అధికారులు నిధులు ఉన్నా కూడా బాధ్యతారాహిత్యం గా వ్యవహరించి ఆలస్యం చేశారని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధుల కొరత అంటూ మరింత కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. పెట్రోల్ బంక్ ముందు రోడ్డు పక్కనే పెద్ద చెట్టు ఉందని దానిని తొలగించి రోడ్డు పక్కన ఉన్న మట్టిని తొలగిస్తే చాలావరకు సమస్య తీరుతుందని ఇలా రోడ్డు విస్తరణ పేరుతో అధికారులు కాలక్షేపం చేయడం సరైనది కాదని పేర్కొన్నారు.

అదేవిధంగా లాలాపేట నాలా వద్ద రోడ్డు పక్కన మటన్ షాప్ ఇంకా తొలగించకపోవడంతో రోడ్డు ఇరుకుగా మారి మరింత ట్రాఫిక్ జాముకు కారణం అవుతుందని అదేవిధంగా మంగళవారం నిర్వహించే సంతతో ట్రాఫిక్ కు చాలా ఇక్కట్లు ఏర్పడుతున్నాయని సంతను రహదారి నుండి తీసివేయాలని కూరగాయలు అమ్మే వాళ్ళు రోడ్డుపైననే అమ్మడంతో ప్రతి మంగళవారం తీవ్రంగా ట్రాఫిక్ జామవుతుందని ఇటు లాలాపేట బ్రిడ్జ్ నుండి తార్నాక వరకు అటు రైల్వే క్వార్టర్ బ్రిడ్జి నుండి ఆర్పిఎఫ్ వరకు ఒక్కొక్కసారి ట్రాఫిక్ జామ్ అవుతుందని దీనిపై ట్రాఫిక్ పోలీసులు కూడా స్పందించి కూరగాయలు అమ్మే వాళ్ళని మరింత లోపలికి అమ్ముకునే విధంగా చూడాలని రహదారి పై ట్రాఫిక్ సక్రమంగా వెళ్లే విధంగా చూడాలని ఈ సందర్భంగా మంత్రి వినోద్ కుమార్ కోరారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers".H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588